
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 5
మంగళవారం 18 ఫిబ్రవరి 2025




కల్లూరు ఆర్ఐ రాజేంద్రప్రసాద్ బదిలీ

కల్లూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కల్లూరు తహసీల్దారు కార్యాలయంలో పనిచేస్తున్న రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్‌ను బదిలీ చేస్తూ జేసీ బి. నవ్య ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు స్పెషల్ కలెక్టర్ కార్యాలయానికి ఆయన డిప్యూటేషన్‌పై బదిలీ అయ్యారని కల్లూరు తహసీల్దారు కె. ఆంజనేయులు సోమవారం తెలిపారు. ఆయన స్థానంలో కలెక్టరేట్ బి సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ జయసింహమౌళికి సీనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ కల్పించినట్లు అధికారులు తెలిపారు.

చుక్కేస్తే.. చిక్కులే..!

- జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక డ్రైవ్
- బ్రీత్ ఎనలైజర్‌తో విస్తృత తనిఖీలు



కర్నూలు క్రైం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. బ్రీత్ ఎనలైజర్‌తో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ముఖ్యంగా జనవరి నుంచి కర్నూలు పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ (మద్యం తాగి వాహనాలు నడపడం)పై ప్రత్యేక దృష్టి సారించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేస్తున్నారు. భారీ జరిమానాలు విధిస్తున్నారు. ఎస్పీగా విక్రాంత్ పాటిల్ బాధ్యతలు చేపట్టిన తర్వాత అన్నీ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రతి రోజూ డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేయాలని గట్టిగా హెచ్చరించారు. దీంతో వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజూ రాత్రి డ్రంకెన్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. సంబంధిత సీఐలు, ఎస్ఐలు రోడ్లపైకి వచ్చి బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీలు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నారు. మరోవైపు ఏఆర్ స్పెషల్ పార్టీ బృందాలతో, డ్రోన్ కెమెరాల సాయంతో ఓపెన్ డ్రింకింగ్‌పై కొరడా ఝుళిపిస్తున్నారు. గత ఏడాదిగా జిల్లా వ్యాప్తంగా డ్రంకెన్ డ్రైవ్ కేసులు పూర్తిగా కనుమరుగయ్యాయి. అడపా దడపా కర్నూలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మాత్రమే డ్రంకెన్ కేసులు నమోదయ్యాయి. ఒక్కసారిగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లు చేపట్టడంతో ఒక్కసారిగా మందుబాబుల్లో వణుకు మొదలైంది.

తాగి వాహనం నడిపితే జైలుకే..

నగరంలో నాలుగు పట్టణ పోలీస్ స్టేషన్లతో పాటు ట్రాఫిక్ పోలీసుస్టేషన్లు, తాలుకా పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. అలాగే జిల్లా నలుమూలల నుంచి వ్యాపారులు, రైతులు కార్మికులు, ఉద్యోగులు, అధికారులు, విద్యార్థులు నగరానికి వస్తుంటారు. ద్విచక్ర వాహనం, కార్లు, ఇతర వాహనాల్లోగాని ప్రతి రోజూ నగరంలో ఉండే పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. రోజుకు నగరంలో లక్షకు పైగా ద్విచక్ర వాహనాలు తిరుగుతుంటాయి. వీధుల్లో రయ్.. రయ్ మంటూ అతివేగంతో బైకులు నడపడమే కాకుండా ఒకరికి ముగ్గురు చొప్పున కూర్చుని వాహనాల్లో వెళ్తుంటారు. దీంతో అటు నగరానికి ఆనుకుని జాతీయ రహదారి ఉండటంతో రోడ్డు ప్రమాదా లకు నిలయంగా మారుతోంది. ఎక్కువగా ప్రయాణాలు రహదారి మీదుగానే చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రయితే చాలు పూటుగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్నారు. బీర్లు తాగి రోడ్లపై పడుతున్నారు. దీంతో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్‌ను చేపట్టారు. ఈ ఏడాది జనవరి నుంచి కర్నూలు నగరంలో నిత్యం నిర్విరామంగా ప్రత్యేక డ్రైవ్ కార్యక్ర మం చేపడుతున్నారు. ట్రాఫిక్ పోలీ సులతో పాటు సివిల్ పోలీసులు కూడా స్టేషన్ల వారీగా రోజు సాయం త్రం ప్రధాన కూడళ్లలో తనిఖీలు చేస్తున్నారు. తనిఖీల్లో పట్టుబడిన వారికి భారీగా జరిమానా విధి స్తున్నారు. ఒక్కో వాహనానికి రూ.3 వేలు నుంచి రూ.3,500 జరిమానా విధించారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రెండు రోజులుగానీ వారం రోజులు గానీ జైలులో ఉండాల్సి వస్తోంది.

లక్ష్యం.. యువతే

పోలీసులు చేపట్టిన డ్రంకెన్ డ్రైవ్‌లో లక్ష్యం మాత్రం యువతే. కళాశాలలకు వెళ్లి తల్లిదండ్రులు ఇచ్చే పాకెట్ మనీతో పూటుగా మద్యం సేవిస్తున్నారు. కూలి పనులకెళ్లే యువకులు సైతం రాత్రుల్లో మద్యం తాగుతున్నారు. వీరిని నియంత్రించేందుకు పోలీసులు డ్రైవ్‌ను చేపడుతున్నారు. ఇప్పటి వరకు పట్టుబడిన వారిలో అధిక శాతం యువకులు ఉండటం గమనార్హం. రోడ్డు ప్రమాదాలు కూడా వీరితోనే ఎక్కువగా జరుగుతున్నాయని పోలీసులు పేర్కొంటున్నారు. బాధ్యతారాహిత్యం, ఏమవుతుందనే భావన.. తల్లిదండ్రుల భయం లేకపోవడంతో వీరి చేష్టలు పెచ్చుమీరి రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి.



పట్టుబడిన వారిలో ద్విచక్ర వాహనదారులే అధికం

డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో చిక్కుతున్న వారిలో ఎక్కువ శాతం ద్విచక్ర వాహనదారులే. వాహనదారుడు నోటి వద్ద పైప్ పెట్టి ఊదిస్తారు.. బ్లడ్ ఆల్కాహాలిక్ కంటెంట్ (రక్తంలో మద్యం) స్థాయి ఎంత ఉందనే విషయం దీన్ని బట్టి తెలిసిపోతుంది. పైప్‌కు అనుసంధానంగా ఉన్న యంత్రంతో ఆ స్థాయి నమోదవుతుంది. 100 ఎంఎల్ రక్తంలో బీఏసీ స్థాయి 30 ఎంజీ కంటే తక్కువగా ఉంటే వదిలేస్తారు. లేదంటే కేసు నమోదు చేసి న్యాయస్థానానికి పంపిస్తారు. పోలీసు తనిఖీల్లో చిక్కినవారిలో 51-100 ఎంజీ స్థాయి ఉన్నవారే అధికంగా ఉంటున్నారు. 30-50 ఎంజీ స్థాయి వారిది రెండో స్థానం. మరోవైపు 300 ఎంజీ స్థాయి ఉన్నవారు సైతం వాహనాలు నడపడం ఆందోళన కలిగిస్తోంది. ఈ సందర్భంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగేందుకు ఆస్కారం ఉంటుందని పోలీసులు అంటున్నారు. ఇటీవల పోలీసుల తనిఖీల్లో కొంత మంది కారు యజమానులను తనిఖీ చేసినప్పుడు 200 పైబడి ఆల్కాహాల్ టెస్టు చూపించడంతో పోలీసులు ఆశ్చర్య పోయారు. అంత శాతం వచ్చిందంటే అన్‌కాన్షియస్ స్టేజీ కింద లెక్కగడతారు. అలాంటి వ్యక్తులు కారు డ్రైవ్ చేస్తున్నారంటే ఎంత ప్రమాదమో ఊహించుకోవచ్చు.



మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. మద్యం తాగడం వల్ల ఒక్క యాక్సిడెంట్ మరణం కూడా సంభవించకూడదనేది పోలీసు శాఖ లక్ష్యం. గతంలో జిల్లాలో 35 బ్రీతింగ్ అనలైజర్లు ఉండగా.. మరో 35 బ్రీత్ అనలైజర్లు తెప్పించాం. గత పది రోజులుగా 500 పైగా డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశాం. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఖచ్చితంగా డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు జరుగుతాయి. ప్రతి రోజు ఈ డ్రైవ్ కొనసాగుతుంది.

-ఎస్పీ విక్రాంత్ పాటిల్

కేసులు ఇలా

జిల్లా వ్యాప్తంగా డ్రంకెన్ డ్రైవ్‌పై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. గతంలో పది బ్రీత్ అనలైజర్లు మాత్రమే ఉండగా.. ప్రస్తుతం 60 దాకా బ్రీత్ అనలైజర్లు తెప్పించారు. ప్రతి రోజూ డ్రంకన్ డ్రైవ్ నిర్వహించాలని ఎస్పీ ఆదేశాలు ఇచ్చారు. వారం రోజులుగా నిర్వహించిన డ్రైవ్‌లో 366 డ్రంకెన్ డ్రైవ్ కేసులు, 705 మంది ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశారు. అలాగే కర్నూలు నగరంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నవంబరు 104, డిసెంబరులో 133, జనవరి 42, ఫిబ్రవరిలో 60 కేసులు నమోదు చేశారు.

మెమోలు జారీ చేయండి

- ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించాలి
- లేదంటే చర్యలు: కలెక్టర్



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి ఫిర్యాదుల పరిష్కారానికి ను ఆయా శాఖల అధికారులు చేసిన ఆడిట్‌లో నాణ్యత లోపిస్తే వెంటనే వారికి మెమోలు జారీ చేయాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం ద్వారా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్, సీఎంవో, మంత్రులు ప్రజా ప్రతినిధులు, ప్రజావేదిక, ఆన్‌లైన్ తదితర సోర్సుల నుంచి అర్జీలు వస్తున్నాయని, వీటిని నాణ్యతతో పరిష్కరించాలని అన్నారు. లేకపోతే చర్యలు తీసుకోవడంలో భాగంగా మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. సీఎం కార్యాలయం నుంచి వచ్చిన అర్జీలు 65, అత్యధికంగా సబ్ కలెక్టర్ ఆదోనికి 20, పత్తికొండ ఆర్డీవోకు 16, కర్నూలు ఆర్డీవోకు 14, సర్వేకు సంబంధించి 2 పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

● **415 అర్జీలు రీ ఓపెన్:** జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య మాట్లాడుతూ రీసర్వే గ్రామ సభల్లో రీ సర్వే గ్రామ సభల దరఖాస్తులకు 415 రీ ఓపెన్ ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రతి ఫిర్యాదును ఆడిట్ చేయాలని, ప్రతి పిటీషనర్‌కు ఫోన్ చేసి ఫీల్డ్‌కు వచ్చారా, నోటీసులు ఇచ్చారా? కనుక్కోవాలన్నారు. సరిగ్గా పరిష్కరించకపోతే మెమోలు జారీ చేయాలని సబ్ కలెక్టర్, ఆర్డీవోలను ఆదేశించారు. కర్నూలు ఆర్డీవో 144, పత్తికొండ ఆర్డీవో 93, ఆదోని సబ్ కలెక్టర్ 19 మెమోలు జారీ చేయాల్సి వుందని, వెంటనే మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో సి. వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బీకే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

102 ఫిర్యాదుల స్వీకరణ



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను చట్టపరిధికి లోబడి పరిష్కరిస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ వెల్లడించారు. సోమవారం కర్నూలు నగరంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 102 మంది బాధితులు తమ ఫిర్యాదులను అర్జీల రూపంలో అందజేశారు. రూ.3.50 లక్షలు తీసుకుని అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ సొసైటీలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి నమ్మించి వెంకటాపురం చెందిన శేఖర్, సుధాకర్‌లు మోసం చేశారని దేవనకొండ మండలం బేతపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. రూ.2.80 లక్షలు తీసుకుని నకిలీ ఇళ్ల పట్టాలు ఇప్పించి రమేష్ అనే వ్యక్తి మోసం చేశాడని పెద్దకడుబూరుకు చెందిన బోయ నరసింహులు ఫిర్యాదు చేశారు. తన కొడుకు రాజేష్ ప్రతి రోజు మద్యం సేవించి వచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని జోహరాపురానికి చెందిన నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు ఎన్టీఆర్ బిల్డింగులకు చెందిన మునాఫ్ అనే వ్యక్తి తనతో వివాహేతర సంబంధం ఏర్పరుచుకుని రూ.4లక్షలు, 5 తులాల బంగారం తీసుకుని అన్యాయం చేశాడనీ కర్నూలుకు చెందిన నందిని ఫిర్యాదు చేశారు. కర్నూలు చెందిన వీరస్వామి రూ.8 లక్షలు, 5 తులాల బంగారు తీసుకుని హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి మోసం చేశాడనీ ఆర్‌కే స్ట్రీట్‌కు చెందిన నాగరాజు ఫిర్యాదు చేశాడని ఎస్పీ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ అడ్మిన్ హుశేన్‌పీరా, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ, సీఐలు శ్రీనివాస నాయక్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న బ్రహ్మోత్సవాలకు రండి

సీఎం చంద్రబాబుకు ఆహ్వానం



ముఖ్యమంత్రిని ఆహ్వానించిన ఎమ్మెల్యే, ఈవో

శ్రీశైలం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి బ్రహ్మోత్సవాలకు సీఎం నారా చంద్రబాబు నాయుడును శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, ఆలయ ఈఓ ఎం.శ్రీనివాసరావుతో పాటు పండితులు ఆహ్వానించారు. సోమవారం అమరావతిలోని సీఎం చంద్రబాబు క్యాంపు కార్యాలయంలో వారు కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు ఆలయ పండితులు స్వామివారి ప్రసాదంతో పాటు చిత్రపటాన్ని అందజేసి ఆశీర్వదించారు. శ్రీశైల మహా క్షేత్రంలో ఫిబ్రవరి 19 నుంచి మార్చి ఒకటో తేదీ వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయి.

గవర్నర్‌కు ఆహ్వానం : శ్రీశైలంలో మహాశివరాత్రి ఉత్సవాలకు ఆలయ అధికారులు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను సోమవారం కలిసి ఆహ్వానం పలికారు. అదేవిధంగా రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, పయ్యావుల కేశవ్‌ను కలిశారు.

మహిళ, శిశు సంక్షేమ శాఖలో పోస్టులకు నోటిఫికేషన్

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెద్దపాడు, పత్తికొండ బాల సదనంలో ఖాళీగా ఉండే ఔట్ సోర్సింగ్, పార్ట్ టైం పద్ధతిలో నియామకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి. నిర్మల సోమవారం తెలిపారు. ఖాళీగా ఉన్న హెల్పర్, హౌస్ కీపర్, కుక్, హెల్పర్ కం నైట్ వాచ్‌మెన్, పార్ట్ టైమ్ టీచర్స్ 1, ఎడ్యుకేటర్ 2, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కమ్ మ్యూజిక్ టీచర్ 3, ఇన్‌స్పెక్టర్ కం యోగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్న ఔట్ సోర్సింగ్, పార్ట్ టైమ్ పద్ధతిలో పోస్టులు ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగుల అభ్యర్థులకు ఐదేళ్ల వయస్సు సడలింపు ఉంటుందన్నారు. అభ్యర్థులు ఈ నెల 18 నుంచి 25వ తేదీలోగా పని దినాల్లో మాత్రమే ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కలెక్టరేట్‌లోని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం రూము నెంబర్. 122 కర్నూలులో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

రమణీయం.. రేణుకా ఎల్లమ్మ రథోత్సవం

వేలాది మంది భక్తులతో కిక్కిరిసిన కోసిగి





వివరాలు 7లో

వేలాదిగా తరలివచ్చిన భక్తుల నడుమ రథోత్సవం (ఇన్‌సెట్‌లో అమ్మవారు)

సాంకేతికతతో సమస్యలు పరిష్కారం

- మంత్రి టీజీ భరత్, కలెక్టర్ పి. రంజిత్‌బాషా
- రూ.2812. కోట్ల అభివృద్ధి పనులకు భూమి పూజ
- స్కాడ వ్యవస్థ నిర్వహణ కేంద్రం ప్రారంభం
- ట్రిపుల్ ఐటీకు తాగునీరు అందించే పంపింగ్ స్టేషన్‌కు శంకుస్థాపన



అశోక్‌నగర్ పంప్‌హౌస్‌లో స్కాడను ప్రారంభిస్తున్న మంత్రి, కలెక్టర్, మేయర్, ఎమ్మెల్యే

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికనుగుణంగా ఆధునాతన సాంకేతికతను వినియోగించుకొని, కష్టతరమైన సమస్యలను వేగంగా పరిష్కరించవచ్చని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్, కలెక్టర్ పి. రంజిత్‌బాషా అన్నారు. సోమవారం రూ.28.12 కోట్లకు సంబంధించి కీలకమైన అభివృద్ధి పనులకు మంత్రి, కలెక్టర్‌తో పాటు మేయర్ బీవై. రామయ్య, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కమిషనర్ ఎస్. రవీంద్రబాబు భూమిపూజ చేశారు. అశోక్‌నగర్ నీటి శుద్ధి కేంద్రం వద్ద రూ.4.62 కోట్లతో నీటి వ్యవస్థ నిర్వహణకు సంబంధించి పర్యవేక్షక వ్యవస్థ, సూపర్‌వైజరీ కంట్రోల్ అండ్ డేటా అక్విజిషన్(స్కాడ)ను, రూ.1.15 కోట్లతో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ద్వారా మంజూరైన 3 శుభ్రత పనుల యంత్రాల వాహనాలు, 2 చెత్త సేకరణ ఎలక్ట్రికల్ వాహనాలను ప్రారంభించారు. అదే విధంగా రూ.22.00 కోట్లతో జగన్నాథ గట్టుమీద నూతనంగా ఏర్పడిన ట్రిపుల్ ఐటీ కాలేజీకి తాగునీరు సరఫరాకు సంబంధించి వీకర్ సెక్షన్ కాలనీ పుచ్చలపల్లి సుందరయ్య పార్కులో 12 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్, సంపు, పంపింగ్ స్టేషన్‌కు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ గత ఎనిమిది నెలలుగా నగరంలో దశాబ్దాల నుంచి ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కల్లూరు ప్రాంతంలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి గత ప్రభుత్వంలో నామమాత్రపు జీవో జారీ చేశారని, బడ్జెట్ లేకుండా టెండర్ పిలిచారని విమర్శించారు. సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు అర్థం చేసుకొని ఆర్థిక ఇబ్బందులో సైతం రూ.22 కోట్లు మంజూరు చేశారని అందుకు ఎమ్మెల్యేకు, సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. స్కాడ వ్యవస్థ గురించి గత ప్రభుత్వం ప్రచార ఆర్భాటంతో సరిపెట్టిందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే దీనికి తాత్కాలిక వ్యవస్థ ఏర్పాటు చేసిందని అన్నారు. నీరు ఎక్కడెక్కడికి ఎంత వెళ్తున్నదీ, ఔట్ ఫ్లో, ఇన్‌ఫ్లో, పైపు లీకేజీ వంటి వివరాలను స్కాడ నిరంతర పర్యవేక్షణ వల్ల వెంటనే తెలుసుకోవచ్చని అన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో దీర్ఘకాలికంగా ఉన్న తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరిస్తుందన్నారు. మేయర్ మాట్లాడుతూ నగరంలో తాగునీటి సమస్య చాలా తీవ్రంగా ఉందని, స్కాడ వ్యవస్థ వినియోగం వల్ల శ్రమ లేకుండా, నీరు వృథా కాకుండా సులువుగా సమస్యలు పరిష్కరించవచ్చన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ట్రిపుల్ ఐటీ డీఎం యూనివర్సిటీకి తాగునీటి సౌకర్యం కోసం రూ.22 కోట్ల వ్యయంతో పనులను ప్రారంభమయ్యాయని అన్నారు. తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించాలంటే గోరుకల్లు రిజర్వాయర్ నుంచి నీటిని సరఫరా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ వీకర్‌సెక్షన్ కాలనీలో పుచ్చలపల్లి సుందరయ్య పార్కులో 12 ఎంఎల్‌డి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, పంపింగ్ స్టేషన్ నిర్మాణం వల్ల వాటర్‌ను శుద్ధి చేసి ట్రిపుల్ ఐటీ డీఎంకు 5 ఎంఎల్‌డి, మిగిలిన 7 ఎంఎల్‌డి నీటిని కల్లూరు ప్రాంతంలో పెద్దపాడు, ఎల్. పేట, వీకర్ సెక్షన్ కాలనీ, ముజఫర్‌నగర్, అబ్బాస్‌నగర్, క్రిష్ణానగర్ తదితర కాలనీల్లో సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి మేయర్ సిద్ధారెడ్డి రేణుక, కార్పొరేటర్లు కురువ పరమేష్, రాజేశ్వరరెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, ప్రజారోగ్య అధికారి కే. విశ్వేశ్వరరెడ్డి, ఎంఈలు శేషసాయి, సత్యనారాయణ, డీఈఈలు గిరిరాజు, మనోహర్‌రెడ్డి, గంగాధర్, ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.




నాపరాళ్లను లోడింగ్ చేస్తున్న కార్మికులు

ఈ-శ్రమ్‌తో భరోసా


రెక్కాడితే గాని డొక్కాడని పేద బతుకులు వారివి. కుటుంబంలో నలుగురు కలిసి పని చేస్తేనే బతుకు బండి ముందుకు వెళ్తుంది. ప్రమాదంలో కుటుంబ పెద్ద మరణిస్తే ఆ కుటుంబ కష్టాలు వర్ణనాతీతం. ప్రీమియం చెల్లించి, బీమా పొందలేని పరిస్థితుల నుంచి అసంఘటిత కార్మికులను కాస్తయినా ఆదుకోవాలన్న లక్ష్యంతో, సామాజిక భద్రతలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను అందుబాటులోకి తీసుకొచ్చింది. కష్టకాలంలో అసంఘటిత రంగ కార్మికులకు అండగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ- శ్రమ్ సురక్ష బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారు ఏదైనా పరిస్థితుల్లో మరణించినా, శాశ్వత అంగవైకల్యం సంభవించినా రూ.2లక్షల బీమా సౌకర్యం అందుతుంది. ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న ప్రతి కార్మికుడికి 12 అంకెలు ఉన్న ప్రత్యేక గుర్తింపు కార్డును అందజేస్తారు. ఈ పథకం చాలా కాలంగా అమలులో ఉన్నా కార్మికులకు కనీస అవగాహన లేక తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో కూటమి ప్రభుత్వం ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్ కార్డులపై విస్తృత అవగాహన కల్పిస్తూ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో అధికారులకు రిజిస్ట్రేషన్లపై లక్ష్యాన్ని విధించి మరీ ముందుకు సాగుతోంది.

- అసంఘటిత కార్మికులకు వరం
- కేంద్ర ప్రభుత్వం ఉచిత ప్రమాద బీమా
- పోర్టల్‌లో వివరాల నమోదుకు అవకాశం
- నేరుగా బ్యాంకు ఖాతాలో నగదు జమ

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 9నుండి 10లక్షల వరకు అసంఘటిత కార్మికులు ఉంటారని అధికారులు అంచనా వేశారు. ఇందులో అత్యధికంగా నంద్యాల జిల్లాలో గని కార్మికులే ఉన్నారు. ఇప్పటి వరకు 7 లక్షల మంది అసంఘటిత కార్మికులు ఈ-శ్రమ్ కార్డులు పొందినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్ స్థానిక సచివాలయాలు, ఇతర కార్యాలయాలతో పాటు, కార్మికులు సొంతంగా ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా పూర్తి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకొనే అవకాశం కల్పించారు. రిజిస్టేషన్ పూర్తి చేసుకున్న వారికి యూనివర్సల్ ఐడెంటిఫికేషన్(యూఎన్ఐ) నంబరుతో కార్డు వస్తుంది. ఈ-శ్రమ్ కార్డులు పొందిన వారు ప్రమాదం జరిగిన వెంటనే సమీపంలోని కస్టమర్ సర్వీస్ సెంటర్‌కు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలి. ఈ వివరాలు ఆయా ప్రాంతాల్లోని డీఆర్‌డీఏ పీడీ కార్యాలయానికి వెళ్తాయి. వీరు మిగిలిన వివరాలన్నింటిని సేకరించి, విచారణ అనంతరం జిల్లా కలెక్టర్ అనుమతికి పంపిస్తారు. అనంతరం ఈ-శ్రమ్ కార్డు పొందిన కార్మికుడు మృతి చెందితే రూ.2లక్షలు, అంగవైకల్యం సంభవిస్తే, ఘటన తీవ్రతను బట్టి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు అందజేస్తారు.

ఈ-శ్రమ్ నమోదుకు కావాల్సిన పత్రాలు

కార్మికుడు ఈకేవైసీ పూర్తి చేసుకున్న ఆధార్ కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలి. ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ ఫోన్ అందుబాటులో ఉండాలి. ఎందుకంటే రిజిస్ట్రేషన్ సమయంలో ఓటీపీ మొబైల్‌కు వస్తుంది. ఓటీపీ సదుపాయం అందుబాటులో లేని కార్మికులు బయోమెట్రిక్, ఫింగర్ ప్రింట్, ఐరిస్, బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ వివరాలతో కస్టమర్ సర్వీస్ సెంటర్ల ద్వారా నమోదు చేసుకోవచ్చు



ఈ-శ్రమ్‌కు అర్హులు ఎవరంటే

ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్‌తో బీమా పొందడానికి 80శాతం కార్మికులు అర్హులుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, ఉపాధి సిబ్బంది, కల్లుగీత కార్మికులు, లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, ఇతర హమాలీలు, డ్రైవర్లు, బీడీ కార్మికులు, టైలర్లు, కుమ్మరి, కమ్మరి, చేనేత, కుట్టు, అల్లికలు, వీధి వ్యాపారులు, బ్యూటీ పార్లర్, సెలూన్ షాప్స్, రజకులు, స్వర్ణ కారులు, మధ్యాహ్న భోజన కార్మికులు, వ్యవసాయ కూలీలు ఇలా అనేక మంది కార్మికులను ఈపథకం కిందకు తీసుకొచ్చారు. 18నుండి 59సంవత్సరాల లోపు వయస్సున్న వారంతా ఈ-శ్రమ్ కార్డులను పొందే అవకాశం కల్పించారు. అయితే పన్ను పరిధిలోకి వచ్చే వారు అనర్హులు. అదేవిధంగా ఎంప్లాయీస్ ప్రావిడెండ్ ఫండ్ (ఈపీఎఫ్), స్టేట్ ఇన్సూరెన్స్ (ఈఎస్ఐ) సదుపాయం ఉన్న వారు దరఖాస్తుకు అనర్హులు.


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఈశ్రమ్‌లో నమోదు చేసుకోవాలి



పేద వర్గాలైన అసంఘటిత కార్మికులను ఆదుకునే పథకం మంచిదే. అయితే దీనిపై కార్మికులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. మరింత విస్తృత అవగాహన కల్పించాలి. కార్మికులు కూడా ఈ శ్రమ్ పోర్టల్‌లో వెంటనే తమ వివరాలను నమోదు చేసుకోవాలి.

– సూర్యనారాయణ, సీపీఐ మండల కార్యదర్శి, కొలిమిగుండ్ల

ఈశ్రమ్ కార్డుతో భవితకు భరోసా



అసంఘటిత రంగంలో పనిచేసే వారికి ఈ శ్రమ్ కార్డు భరోసానిస్తుంది. అసంఘటిత రంగంలో పనిచేసే వారికి ఎలాంటి ఈపీఎఫ్, ఈఎస్ఐ ఉండవు. అలాంటి వారికి ఆర్థిక, సామాజిక భద్రత అందించడానికి కేంద్ర ప్రభుత్వం ఈశ్రమ్ పథకాన్ని తీసుకొచ్చింది. బనగానపల్లె డివిజన్‌లోని బనగానపల్లె, కొలిమిగుండ్ల, అవుకు, కోవెలకుంట్ల, సంజామల, దొర్నిపాడు, ఉయ్యాలవాడ తదితర 7 మండలాల్లో 1,27,765 మంది కార్మికులను రిజిస్ట్రేషన్ చేయించాలని ఉన్నతాధికారులు లక్ష్యం విధించారు. ఇప్పటి వరకు 40వేలు ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్లు పూర్తి చేశాం. నంద్యాల జిల్లాలో ఇప్పటి వరకు ఈపథకం ద్వారా పది మంది కార్మికులకు ప్రమాద బీమా చెల్లించడం జరిగింది.

–శోభారాణి, కార్మిక శాఖ డివిజనల్ అధికారి, బనగానపల్లె



కార్మికులకు మంచి అవకాశం

వివిధ పనులకు వెళ్లేవారు, కార్మికులకు ఇలాంటి బీమా సౌకర్యం కల్పించడం మంచి నిర్ణయం. సాధారణంగా కార్మికులు నిత్యం ప్రమాదపు అంచునే పని చేస్తుంటారు. అలాంటి వారికి ఇలాంటి కేంద్ర పథకం నిజంగానే ఒక వరం. అందరూ ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి.

– మెట్టె రమేష్, ట్రాక్టర్ డ్రైవర్, కొలిమిగుండ్ల

కార్మికుల్లో అవగాహన కరువు

పేద కార్మికుల కోసం అమల్లోకి తీసుకొచ్చిన ఈ పథకం ఉద్దేశం చాలా బాగుంది. కానీ చాలా మందిలో ఈ పథకంపై ఎలాంటి అవగాహన లేదు. కార్మికులకు ఇలాంటి పథకాలపై నిత్యం అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఎలాంటి ఖర్చు లేకుండా సులువుగా రిజిస్ట్రేషన్ చేసుకునేలా ఈ పథకాన్ని రూపొందించారు.



– రఘురాముడు, ఎలక్ట్రీషియన్

'నేను సైబర్ స్మార్ట్'పై అవగాహన కల్పించండి

- కేవీఆర్‌లో జరిగిన సదస్సులో మంత్రి టీజీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల నివారణ కోసం చేపట్టిన 'నేను సైబర్ స్మార్ట్'పై కార్యక్రమంపై అవగాహన కల్పించాలని మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం నగరంలోని కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వివిధ రకాల సైబర్ నేరాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై లఘు చిత్రాలను ప్రదర్శించారు. ఈ అవగాహన సదస్సుకు హాజరైన విద్యార్థుల నుద్దేశించి మంత్రి భరత్ మాట్లాడుతూ సైబర్ నేరాల బారిన పడకుండా మహిళలు, యువత జాగ్రత్తగా ఉండాలన్నారు. కస్టమ్స్ అధికారులమని, పోలీసు, బ్యాంక్ అధికారులమని మోసాలకు పాల్పడుతున్నారన్నారు. బ్యాంక్ ఖాతాలను హ్యాక్ చేయడానికి సైబర్ నేరగాళ్లు ప్రయత్నిస్తుంటారని, స్ట్రాంగ్ పాస్ వర్డ్ ఉంచుకోవాలని అన్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ఇటీవల టెక్నాలజీ పెరగడంతో పాటు సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయన్నారు. డిజిట్ అరెస్టులు, జాబ్ ఫ్రాడ్స్, కేవైసీ, ఓటీపీ మోసాలు, పెట్టుబడి మోసాలు ఎక్కువయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్, క్లస్టర్ వర్సిటీ ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్, రిజిస్ట్రార్ కె. వెంకటేశ్వర్లు, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. హుసేన్ పీర, డీఎస్పీ బాబు ప్రసాద్, సైబర్ ల్యాబ్ సిబ్బంది, కేవీఆర్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతుల సహకారంతోనే బంగారు నిక్షేపాల ఫ్యాక్టరీ


మాట్లాడుతున్న జియో మైసూరు కంపెనీ ఎండీ హనుమప్రసాద్

తుగ్గలి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జియో మైసూరు కంపెనీ చేపట్టిన బంగారు నిక్షేపాల ఫ్యాక్టరీ రైతుల సహకారంతోనే ముందుకు వెళ్తుందని, ఆ కంపెనీ ఎండీ హనుమ ప్రసాద్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని జొన్నగిరి గ్రామ శివారులో ఉన్న జియో మైసూరు కంపెనీలో ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి రైతులు, నిరుద్యోగులు ఎదురు చూస్తున్న జియో మైసూరు కంపెనీ బంగారు వెలికితీత ఫ్యాక్టరీ నిర్మాణం పనులు చురుగ్గా జరుగుతున్నాయని అన్నారు. రాబోయే ఆరు నెలల్లో బంగారు వెలికితీత ప్రారంభమవుతుందన్నారు. 2010 నుంచి కంపెనీ ఏర్పాటుకు ఎంతో కృషి చేశామని, జొన్నగిరి, పగిడిరాయి, బొండ్లవాని పల్లె తదితర గ్రామాల రైతులు కూడా ఎంతో సహకరించారని అన్నారు. మొదట్లో 1500 ఎకరాలను లీజుకు తీసుకున్నామని, ఫ్యాక్టరీ నిర్మాణం కోసం ఇప్పటికే 260 ఎకరాలు కొనుగోలు చేశామని తెలిపారు. కంపెనీలో ఇప్పటికే 150 మందికి ఉద్యోగాలు ఇచ్చామని, ఫ్యాక్టరీ ప్రారంభమయ్యాక మరో 200 మందికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో జియోమైసూరు కంపెనీ డైరెక్టర్లు జేట్ డెవనిస్, మానసర రంజన్ బిస్వాల్ ఉన్నారు.

హరిహరరాయల శాసనం లభ్యం

కోడుమూరు రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కోడుమూరు, వర్కూరు గ్రామాల మధ్య ఓ పొలంలో 14 వ శతాబ్దం నాటి శిలాశాసనం లభ్యమైంది. ఇది విజయనగర సామ్రాజ్య వ్యవస్థాపకుడు మొదటి హరిహరరాయలు వేయించిన శిలాశాసనంగా గుర్తించారు. ఈ శిలాశాసనాన్ని ఇటీవల పురావస్తు శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్‌నాయుడు తెలిపారు. పర్వత మల్లికార్జునుడి (శ్రీశైల మల్లికార్జునస్వామి) శివరాత్రి అన్నదానానికి కోడుమూరు గ్రామం నుంచి వందల ఎకరాలపై వచ్చే ఆదాయం, కొన్ని బంగారు వరహాలను కేటాయించినట్లు శాసనంలో ఉంది. అయితే శృంగేరిలో ఉన్న శిలాశాసనాల మీద రెండు సముద్రాల మధ్య రాజ్యానికి హరిహర రాయలు రాజు అని నమోదై ఉన్నది. కానీ తాజాగా కనుగొన్న ఈ శాసనంలో హరిహరరాయలు మూడు సముద్రాల మధ్య సామ్రాజ్యానికి అధిపతి అని ఉండడం చరిత్రకారులను అబ్బురపరుస్తోంది. ఈ శిలాశాసనంలో కోడుమూరు పూర్వనామం కొలుమురా అని ఉంది. ఈ శిలాశాసనాన్ని భారతీయ పురావస్తుశాఖ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి ద్వారా కన్నడ నుంచి తెలుగులో తర్జుమా చేయించి ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేయించినట్లు మల్లేష్‌నాయుడు ఆంధ్రజ్యోతికి తెలియజేశారు.


రాతి ఫలకానికి ఇరువైపులా లిపి

పుస్తకాల ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కర్నూలు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య రచించిన రెండు పుస్తకాలను ప్రకాశం జిల్లా గిద్దలూరులో ఎమ్మెల్యే ముత్తముల అశోక్‌రెడ్డి ఆవిష్కరించారు. సోమవారం గిద్దలూరులోని ఎమ్మెల్యే స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పత్తి ఓబులయ్య రాసిన 'సెల్లు పురాణం', 'జగదేకసుందరి సామా' పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు నియోజక వర్గంలోని జల్లివారి పుల్లలచెరువు గ్రామానికి చెందిన పత్తి ఓబులయ్య విద్యావంతునిగా ఎదిగి, కర్నూలులో గత 50 ఏళ్లుగా నివాసం ఉంటూ నటునిగా, రచయితగా, నంది అవార్డుల గ్రహీతగా రాణించడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన రంగస్థల ప్రముఖ నటీమణులు రత్నశ్రీ, తిరుమల తేజలను కూడా సత్కరించి, నగదు బహుమతులను అందజేశారు. అనంతరం ఓబులయ్యను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మున్సిపల్ ఛైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, రమేష్, ఎలమంద, గురుమూర్తి, పుట్టా మహేష్ పాల్గొన్నారు.


రచయిత పత్తి ఓబులయ్యను సత్కరిస్తున్న గిద్దలూరు ఎమ్మెల్యే

మహానంది మాస్టర్ ప్లాన్ అమలుకు సహకరించండి

- సీఎంకు ఎమ్మెల్యే, ఈఓల వినతి
- ఉత్సవాలకు ఆహ్వానం


ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రికను అందచేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయ అభివృద్ధిలో భాగంగా రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌కు సహకరించాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాస రెడ్డిలు సీఎం చంద్రబాబు నాయుడును కోరారు. ఈ మేరకు సోమవారం అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో సీఎంను కలిసిన వారు మహానంది శివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఈఓలు సీఎంకు ఆహ్వానపత్రికను అందజేశారు. అదేవిధంగా ఆలయ అర్చకులు వేదాశ్వీరచనం పలికి సత్కరించారు. అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ మహానంది ఆలయ అభివృద్ధికి తప్పక సహకరిస్తానని హామీనిచ్చారు. చంద్రబాబును కలిసిన వారిలో వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, అర్చకులు శంకరయ్యశర్మ తదితరులు ఉన్నారు.

వైభవంగా బ్రహ్మంగారి రథోత్సవం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- హాజరైన ఎంపీ బస్తిపాటి, ఎమ్మెల్యే కేఈ
- భక్తులతో కిక్కిరిసిన పత్తికొండ


పత్తికొండలో అశేషజన సందోహం నడుమ సాగుతున్న రథోత్సవం

పత్తికొండ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): శ్రీమత్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం సోమవారం పత్తికొండ పట్టణంలో కన్నుల పండువగా సాగింది. వేలాదిగా హాజరైన భక్తులతో పట్టణం కిక్కిరిసింది. రథోత్సవం సందర్భంగా పెద్దాంజనేయస్వామి ఆలయం వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన రథంపై వీరబ్రహ్మేంద్రస్వామిని ఉంచి రథాంగ పూజలు నిర్వహించారు. ఈ రథోత్సవానికి ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. పెద్దాంజనేయస్వామి దేవాలయం నుంచి ప్రారంభమైన రథోత్సవం వడ్డేవారికట్ట వరకు చేరుకుంది. అక్కడినుండి తిరిగి తేరుబజార్ చెన్నకేశవస్వామిదేవాలయం వరకుసాగింది. ఆనవాయితీ ప్రకారం భక్తులు తేరులో ఉత్సవమూర్తులకు అరటిపళ్లను విసిరి మొక్కులు తీర్చుకున్నారు. బ్రహ్మంగారి రథోత్సవ కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో తేరుబజార్, పాతపేట మెయిన్‌రోడ్‌తో పాటు ఇతర వీధులన్ని కిక్కిరిశాయి. భక్తులకు ఇబ్బందులు కలగకుండా డీఎస్పీ వెంకట్రామయ్య నేతృత్వంలో సీఐలు జయన్న, పులిశేఖర్, మధుసూదన్‌లు బందోబస్తు నిర్వహించారు. ఈ రథోత్సవంలో ఆర్డీవో భరత్‌నాయక్, సర్పంచ్ కొమ్ముదీపిక, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, సీనియర్ నాయకులు సాంబశివారెడ్డి, బత్తిని వెంకట్రాముడు, మనోహర్‌చౌదరి, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, కేఈ నందీశ్వర్‌గౌడ్, కేఈ రుద్రగౌడ్, తిరుపాల్, రామానాయుడు, బత్తిని లోక్‌నాథ్, టీటీ గోవిందు, ఆలయ నిర్వాహకులు ఎల్లారెడ్డి, తుప్పటి నాగన్న, న్యాయవాది సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ బస్తిపాటి, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

రమణీయం.. రేణుకా ఎల్లమ్మ రథోత్సవం

వేలాది మంది భక్తులతో కిక్కిరిసిన కోసిగి



పూజలందుకుంటున్న రేణుకా ఎల్లమ్మ

కోసిగి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కొలిచేవారికి కొంగుబంగారంగా విరాజిల్లుతున్న కోసిగి రేణుకా ఎల్లమ్మ రథోత్సవం సోమవారం సాయంత్రం అశేష జనవాహిని మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. ఈ రథోత్సవానికి ఎమ్మెల్సీ బీటీ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, ఆయన తనయుడు దివాకర్ రెడ్డి, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి హాజరై అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచే రేణుకా ఎల్లమ్మదేవికి ఆలయ అర్చకులు మూర్తిగౌడు, గౌడీష్‌గౌడు కుంకుమార్చన, మంగళహారతి, పుష్పాలంకరణ వంటి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల నుంచి వేలాది భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి నైవేద్యంగా కుడుములు, గుగ్గిళ్లు, కల్లు, ఉప్పు సమర్పించారు. దొరల వంశస్థులు పూర్ణకుంభంతో వచ్చి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రథోత్సవం ముందుకు కదిలింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో సుమారు 150 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, టీడీపీ లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు న్యాయవాది వీరేష్, అయ్యన్న, చిన్నతాయన్న, భరద్వాజశెట్టి, రవితేజ శెట్టి, హనుమంతు, వీరారెడ్డి, పంపాపతి, జ్ఞానేష్, చింతలగేని నర్సారెడ్డి ఉన్నారు.




ఉత్సవానికి హాజరైన టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, రథోత్సవం ఎదుట పూజలు చేస్తున్న రాఘవేంద్రరెడ్డి



అశేష జనవాహిని మధ్య రథంపై ఊరేగుతున్న రేణుకా ఎల్లమ్మ

ఓర్వకల్లులో అక్రమ రిజిస్ట్రేషన్లు

- ఒకే సర్వే నెంబరుపై ఇద్దరి పేరిట రిజిస్ట్రేషన్
- కార్యాలయం ఎదుట బాధితురాలి నిరసన



ఓర్వకల్లు సబ్ స్టేషన్ ఎదురుగా నిరసన తెలుపుతున్న బాధితురాలు, వామపక్ష నాయకులు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్లు జోరుగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నంద్యాల జిల్లా నంద్యాల మండలం గిద్దలూరు గ్రామానికి చెందిన కె. లక్ష్మీశాంతి కుమారి మండలంలోని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన దస్తగిరి పొలం 298/1 సర్వేలో 1.50 సెంట్ల భూమిని రూ.10 లక్షలకు కొన్నారు. ఓర్వకల్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆమె పేరుతో రిజిస్ట్రేషన్ అయింది. ఇదే సర్వే నెంబరును గంగుల ఆదినారాయణ పేరుతో రెండో రిజిస్ట్రేషన్ జరిగినట్లు తెలుస్తోంది. దీనిపై కే. లక్ష్మీశాంతి కుమారి సోమవారం తహసీల్దార్ విద్యాసాగర్, ఎస్ఐ సునీల్‌కు ఫిర్యాదు చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టింది. ఆమెకు ఆర్‌బీఎఫ్ రాష్ట్ర నాయకుడు రవీంద్ర నాయక్, సీపీఐ మండల కార్యదర్శి రమేష్ అండగా నిలిచారు. లక్ష్మీశాంత కుమారికి 17-05-203న రిజిస్ట్రేషన్ అయిందని, అదే స్థలాన్ని ఇటీవల కొత్తగా మళ్లీ రిజిస్టర్ చేశారని అన్నారు. రెండో రిజిస్ట్రేషన్‌కు కారణమైన సబ్ రిజిస్ట్రార్, డాక్యుమెంటు రైటరుపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో నిరసనను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఓర్వకల్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతున్నాయని, వాటిపై నిఘా పెట్టాలని వారు డిమాండ్ చేశారు.

నేటి నుంచి లాంగ్వేజ్ ఫెస్టివల్స్

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17: (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 18 నుంచి 21 వరకు లాంగ్వేజ్ ఫెస్టివల్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ తెలిపారు. ఫిబ్రవరి 18న ఇంగ్లీషు లాంగ్వేజ్, 19న సంస్కృతం, హిందీ, ఉర్దూ, 20న గిరిజన బాషా, కన్నడ, తమిళం, ఒడియా, 21న తెలుగు బాష ఫెస్టివల్స్ నిర్వహించాలన్నారు. ఆదోని డివిజన్‌లో కన్నడ మాధ్యమం పాఠశాలలు ఉన్నందువలన ఆ ప్రాంతంలో కన్నడ భాషకు సంబంధించిన బాషాకృత్యాలు చేయాలన్నారు. తోలుబొమ్మలు, అద్భుత కథలు, గానం, క్విజ్ పోటీల వంటి భిన్నమైన కార్యకలాపాలను పిల్లల్లో అభివృద్ధి చేయడం కోసం ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 372 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.1.86 లక్షలు పాఠశాలల ఖాతాలకు నిధులు జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమాల నివేదికలను మండలాల విద్యాశాఖ అధికారుల ధృవీకరణతో జిల్లా కార్యాలయానికి పంపాలని డీఈవో వివరించారు.

రసాయనాల వాడకంపై ఉప లోకాయుక్త ఆగ్రహం

కర్నూలు లీగల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పండ్లను కృత్రిమంగా పక్వం చేసేందుకు రసాయనాలు వాడటం పట్ల రాష్ట్ర ఉప లోకాయుక్త పి. రజని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాదుకు చెందిన జే. గోవర్దన్ రెడ్డి ఈ మేరకు దాఖలు చేసిన ఫిర్యాదులపై రాష్ట్ర ఉప లోకాయుక్త ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. రాష్ట్రంలో మామిడి పండ్ల పక్వానికి వ్యాపారులు క్యాల్షియం కార్బైడ్, ఇథలైన్ గ్యాస్ వంటి రసాయనాలు వాడుతున్నారని, దీంతో వినియోగదారులు అనారోగ్యాలకు గురవుతున్నారని గత ఏడాది లోకాయుక్తకు ఓ ఫిర్యాదు వచ్చింది. దీనిపై రాష్ట్ర ఉప లోకాయుక్త తీవ్రంగా స్పందించి పండ్ల పక్వానికి రసాయనాలు వాడటం చట్టవ్యతిరేకమని బాధ్యులపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ కమిటీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్, మార్కెటింగ్ శాఖ సహాయ డైరెక్టర్, మున్సిపల్ కమిషనర్లు, హార్టికల్చర్ సహాయ డైరెక్టర్ మెంబర్లుగా ఉండాలని ఉప లోకాయుక్త తన ఆదేశాలలో పేర్కొన్నారు.

ఎస్సీ హాస్టల్ తనిఖీ



విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది

కర్నూలు లీగల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం పెద్దపాడులోని ప్రభుత్వ ఎస్సీ హాస్టల్, దామోదరం సంజీవయ్య బాలసదన్ హాస్టళ్లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది సోమవారం తనిఖీ చేశారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆయన హాస్టళ్లలోని సౌకర్యాలు, ఆహార నాణ్యత పరిశుభ్రతను పరిశీలించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఆ తర్వాత కార్యాలయాలకు సంబంధించిన రిజిస్టర్లను ఆహార నాణ్యతను ఆయన తనిఖీలు చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి కూడా పాల్గొన్నారు.

ఫ్యామిలీ కౌన్సెలింగ్‌తో ఒక్కటైన దంపతులు

- పోలీసులకు మిఠాయిలు పంచిన మహిళ తండ్రి



పోలీసుల సమక్షంలో ఒక్కటైన దంపతులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా రెండేళ్లుగా దూరంగా ఉంటున్న దంపతులు ఆత్మకూరు పోలీసుల ఫ్యామిలీ కౌన్సెలింగ్ ద్వారా ఒక్కటయ్యారు. ఇందుకు సంబంధించి అర్బన్ సీఐ రాము తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు మండలంలోని శ్రీపతిరావుపేట గ్రామానికి చెందిన హేమలతకు తెలంగాణ రాష్ట్రంలోని గద్వాల జిల్లాలో గల సుల్తానాపురం గ్రామానికి చెందిన హరీష్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె ఉంది. అయితే కుటుంబంలో నెలకొన్న కలహాల కారణంగా రెండేళ్లుగా వారు విడిపోయారు. అయితే తన కుమార్తెను, అల్లుడిని కలపాలని హేమలత తండ్రి ఆత్మకూరు పోలీసులను ఆశ్రయించడంతో అర్బన్ సీఐ రాము ప్రత్యేక చొరవ తీసుకుని రెండుసార్లు ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఇచ్చారు. సోమవారం ఇరువురు భార్యాభర్తలను పోలీసుస్టేషన్‌కు పిలిపించి సర్దిచెప్పారు. కుమార్తె కాపురం చక్కదిద్దడంతో హేమలత తండ్రి సుబ్బారెడ్డి పోలీసు స్టేషన్‌లో మిఠాయిలు పంచి ఆనందం వ్యక్తం చేశారు.

హత్య చేశారా? మాయం చేశారా?

యూట్యూబర్ తిరుమలరెడ్డి ఉదంతంపై అనుమానాలు



హంద్రీనీవా కాలువలో గాలిస్తున్న పోలీసులు



తిరుమల్ రెడ్డి (ఫైల్)

మద్దికెర, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీవీఆర్ యూట్యూబర్ తిరుమల్ రెడ్డి ఉదంతం చర్చనీయాంశంగా మారింది. మద్దికెర గ్రామ శివారులోని బుగ్గ సంగమేశ్వరి ఆలయ పరిసరాల్లోని హంద్రీనీవా కాలువ సమీపాన ఆయన చెప్పులు, సెల్‌ఫోన్, బైక్ కనిపించాయి. ఆయనను హత్య చేసి కాలువలో పడేశారా..? లేక మాయం చేశారా? అనేది తెలియాల్సి ఉంది. మద్దికెర గ్రామానికి చెందిన వెంకటరెడ్డి, సౌభాగ్యలక్ష్మి దంపతుల కుమారుడైన బోగోలు తిరుమలరెడ్డి గత కొన్నేళ్లుగా వివిధ యూట్యూబ్ చానళ్లలో పని చేస్తూ ఇటీవల సొంతంగా బీవీఆర్ యూట్యూబ్ చానల్ ఏర్పాటు చేసుకున్నారు. తిరుమల్‌రెడ్డి భార్య కావ్యతో కలిసి గుంతకల్లులో నివసిస్తున్నారు. యూట్యూబ్ చానల్‌తోపాటు బీవీఆర్ పత్రికను ప్రచురించి గుంతకల్లు, మద్దికెర ప్రాంతాల్లో అందుబాటులోకి తీసుకొస్తున్నారు. గుంతకల్లులో కాపురం ఉంటున్నప్పటికీ మద్దికెర గ్రామ శివారులోఉన్న తమ వ్యవసాయ తోటలో పనులు చేయిస్తూ వచ్చాడు. అందులో భాగంగా సోమవారం ఉదయం సుమారు 7 గంటల ప్రాంతంలో వ్యవసాయ తోటకు బయల్దేరినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత ఆయన కనిపించకుండాపోయాడు. తిరుమల్‌రెడ్డి సెల్‌ఫోన్, ద్విచక్రవాహనం, చెప్పులు హంద్రీ నీవా సమీపంలో కనిపించాయి. అయితే ద్విచక్రవాహనం నుజ్జునుజ్జు అయింది. దీన్ని బట్టి ఎవరైనా దాడి చేసి కిడ్నాప్ చేశారా.. లేక హత్య చేసి హంద్రీనీవా కాలువలో పడేశారా? అనే సందేహం కలుగుతోంది. సంఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తే ద్విచక్రవాహనం పడిన పది అడుగుల దూరం మనిషిని లాక్కెళ్లినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. అంతేగాక తిరుమల్ రెడ్డి కట్టుకున్న పంచ ముక్క అక్కడ కనిపిస్తోంది. తిరుమల్ రెడ్డికి పదెకరాల వ్యవసాయ పొలం, ఒక్కగానొక్క కూతురు మౌని ఉన్నారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. కాలువలో గజ ఈతగాళ్లతో వెతికించినప్పటికీ మృతదేహం ఆనావాళ్లు లభించలేదు. అలాగే అనంతపురం నుంచి డాగ్ స్క్వాడ్ ద్వారా సంఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

2.77 ఎకరాల భూమి కబ్జా చేశారు

- న్యాయం చేయాలని ఎమ్మెల్యేకు బాధితుల మొర



ఎమ్మెల్యేతో మొరపెట్టుకుంటున్న బాధితులు

ఆదోని, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణ శివారులోని మండిగిరి పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 447లో 2.77 ఎకరాల భూమిని వైసీపీ నాయకులు కబ్జా చేశారని వెంకన్నపేటకు చెందిన మల్లికార్జున, నాగేంద్రమ్మ కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఎమ్మెల్యే పార్థసారథిని సోమవారం ఆదోనిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి మొరపెట్టుకున్నారు. తమకు తాతముత్తాతల కాలం నుంచి వారసత్వంగా వస్తున్న భూమిని కబ్జా చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం ఈ స్థలం విలువ రూ.20 కోట్లు పైగా ఉందని చెప్పారు.

భూ కబ్జాదారులను వదిలిపెట్టం: ఎమ్మెల్యే పార్థసారథి

భూ కబ్జాదారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే పార్థసారథి హెచ్చరించారు. ఆయన ఎమ్మెల్యే మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో ఉన్న జయరాంరెడ్డి అనే వ్యక్తి అప్పటి ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డికి తొత్తుగా మారి అక్రమాలకు పాల్పడ్డాడని మండిపడ్డారు. ఆదోని డివిజన్‌లో జయరామిరెడ్డి బాధితులు అనేకమంది ఉన్నారని, వారందరూ సబ్ కలెక్టర్‌కు ఉత్తరం ద్వారా ఫిర్యాదు చేస్తే పేర్లు బయట పెట్టకుండా విచారణ చేసి న్యాయం చేస్తామని చెప్పారు. సర్వే నెంబరు 447పై పూర్తి అయ్యేదాకా మరొకరికి రిజిస్ట్రేషన్ చేయవద్దని కలెక్టర్‌తో పాటు జిల్లా రిజిస్ట్రార్‌కు లేఖ రాస్తున్నట్లు తెలిపారు. ఆదోనిలో ఉన్న విలువైన భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని, ఆ తరువాత ఆ పొలాన్ని మరొకరికి విక్రయిస్తున్నారని అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో భూ మాఫియా రాజ్యమేలిందని, ఎవరి భూములు ఆక్రమించుకున్నారో వారందరూ తనకు ఫిర్యాదు చేస్తే న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. రాజకీయ పలుకుబడితో కబ్జాలు చేశారని, ఇప్పటి వరకు 30మంది కబ్జాదారుల పేర్లు బయట పెట్టారని చెప్పారు. మరో 60 నుంచి 70 మంది వరకు భూ కబ్జాదారులు ఉన్నట్లు సమాచారం ఉందని, వారి వివరాలు కడా సేకరిస్తున్నట్లు తెలిపారు. వారు కబ్జాలకు ఎక్కడ పాల్పడ్డారో పూర్తి వివరాలతో బయట పెడతానన్నారు. ప్రస్తుతం సర్వే నెం.447లో ఉన్న 2.77 ఎకరాలను కార్వన్ పేటకుచెందిన కత్తి రవి అనే వ్యక్తిపై రిజిస్ట్రేషన్ అయ్యిందని తెలిపారు. వారసత్వంగా వచ్చిన భూమిని ఇలా మరొకరికి రిజిస్ట్రేషన్ చేయడంపైన కూడా విచారణ చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీ కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, మధు, ఉపేంద్ర, నాగరాజుగౌడ్, తదితరులు ఉన్నారు.

సీమ ప్రాజెక్టులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి

- కర్నూలులోనే కృష్ణా బోర్డు ఏర్పాటు చేయాలి
- ఎన్టీఆర్ చేపట్టిన ప్రాజెక్టులు 40 ఏళ్లైనా పూర్తి చేయలేదు
- భారతీయులను అమెరికా బేడీలతో తీసుకురావడం అనాగరికం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కర్నూలు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టబోయే బడ్జెట్ 2025-26లో రాయలసీమ ప్రాజెక్టులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1985లో ఆనాటి సీఎం ఎన్టీఆర్ హంద్రీనీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారని, 40 ఏళ్లు గడిచినా ఇప్పటికీ అవి పూర్తి కాలేదని అన్నారు. కర్నూలులో కృష్ణా బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. గత సీఎం జగన్ విశాఖలో పెట్టాలనుకుంటే, ప్రస్తుత సీఎం చంద్రబాబు అమరావతిలో పెడుతామని అనడం విడ్డూరంగా ఉందని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు కృష్ణా జలాలు మళ్లించే ప్రధాన వ్యవస్థ ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉందని, కృష్ణా బేసినలో ఏపీ, తెలంగాణ నిర్మించిన ప్రాజెక్టులు కర్నూలుకు దగ్గరలో ఉన్నాయని ఇక్కడే కృష్ణా బోర్డు కార్యాలయం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. హైకోర్టు బెంచ్ కర్నూలు ఏర్పాటుకు టీడీపీ కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తే.. కొందరు హైకోర్టును ఆశ్రయించడం సరైంది కాదన్నారు. హంద్రీనీవా కాలువ సీసీ లైనింగ్‌కు సీపీఐ వ్యతిరేకమని, 6 వేల క్యూసెక్కులకు కాలువను విస్తరించాలని డిమాండ్ చేశారు. తద్వారా భూగర్భ జలాలు పెరిగి బోరుబావుల ద్వారా మెట్ట పొలాకు సాగునీరు, గ్రామాలకు తాగునీటి సమస్య తీరుతుందని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం హంద్రీ నీవా ఫేజ్-2 కింద అనంతపురం జిల్లాలో చేపట్టబోయే లైనింగ్ పనులను ఉప సంహరించుకోవాలని, కాలువ విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లాలో ఒక్కటే 2.50 లక్షల కుటుంబాలు గుంటూరు, తెలంగాణ ప్రాంతాలకు మిరప కోత, పత్తి తీత పనులకు వెళ్లారంటే కరువు దుర్భిక్ష పరిస్థితులు ప్రజలను ఎలా వెంటాడుతున్నాయో అర్థం చేసుకోవచ్చని అన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ సీమ ప్రాజెక్టుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యం వ్యవహరించారని, చంద్రబాబు ప్రభుత్వం కూడా అదే దారిలో నిర్లక్ష్యం చేస్తే ప్రాజెక్టుల సాధన కోసం సీపీఐ దశవారి ఆందోళనలకు సిద్ధం కావాల్సి వస్తుందని గుర్తు చేశారు. కర్నూలు జిల్లాలో వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ పనులు తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వంతో చర్చించి గుండ్రేవుల జలాశయం నిర్మాణం చేపడితే కేసీ కాలువ ఆయకట్టు, ఎగువ జలాలు ఆధారంగా కరువు పల్లెలను సస్యశ్యామలం చేసే అవకాశం ఉందని, ఆ దిశగా టీడీపీ కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, లెనిన్‌బాబు, సీనియర్ నాయకులు జగన్నాథం, జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

28 నుంచి రోజా దర్గా ఉరుసు



రోజా దర్గా ఉరుసు మహోత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దర్గా పీఠాధిపతి, మత పెద్దలు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఐదు వందల ఏళ్లకు పైగా విరాజిల్లుతూ, చారిత్రక దర్గాగా చరిత్రకెక్కిన రోజా దర్గాలో 535వ ఉరుసు మహోత్సవాలు ఈనెల 28 నుంచి మార్చి 2 వరకు నిర్వహిస్తున్నట్లు దర్గా పీఠాధిపతి సయ్యద్‌షా జమాల్‌వుల్లా ఖాద్రి అల్ జీలాని అల్ ఇస్హాఖీ వెల్లడించారు. సోమవారం దర్గా ఆవరణలో ఉరుసు ఉత్సవాల పోస్టర్లను ఆయన ముస్లిం మతపెద్దలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ రోజా దర్గా ఐదు వందల ఏళ్లకు పైగా హిందూ, ముస్లింల మతసామరస్యానికి ప్రతీకగా ఉందన్నారు. రోజా దర్గాలో సమాధిని పొందిన బాబా హజ్రత్ సయ్యద్ షా ఇస్హాఖ్ సనావుల్లా ఖాద్రి ఎంతో మహిమాన్వితుడైన వారన్నారు. వేలాదిగా తరలివచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేశామన్నారు. 28న సాయంత్రం 7 గంటలకు ఉరుసు ప్రారంభమవుతుందన్నారు. పీఠాధిపతి ఇంటి నుంచి భారీ ఊరేగింపుతో సంద్ ముఖద్దస్ (గంధము తీసుకుని వెళ్లే) కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మార్చి 1న రాత్రి 10 గంటలకు హైదరాబాదుకు చెందిన ప్రముఖ కళాకారులతో ఖవ్వాలి ఉంటుందన్నారు. మార్చి 2న ఉదయం 9 గంటలకు దర్గాలో జియారత్ కె ఫాతెహా కార్యక్రమం ఉంటుందన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

పగిడ్యాల, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత వనములపాడు గ్రామంలోని శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో సోమవారం మృతదేహం లభ్యమైంది. ఉదయం చేపల వేటకు వెళ్లిన కొంత మంది మత్స్యకారులు మృతదేహాన్ని గమనించి ముచ్చుమర్రి ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. దీంతో నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. నదిలో చేపలు పట్టేందుకు వచ్చిన వలస మత్స్యకారుడిని చంపి నదిలో పడవేసి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహం కుళ్లిపోయి ఉండటంతో పది రోజుల క్రితం ఘటన జరిగి ఉండవచ్చని అన్నారు. నదిలో నీరు తగ్గిపోవడంతో మృతదేహం బయటపడినట్లు తెలిపారు. మృతుడి వయస్సు 40 ఏళ్లు ఉండవచ్చునని, మృతుడు బ్లూ కలర్ టీషర్టు, తెల్ల గీతలు కలిగిన నల్లరంగు చొక్కా ధరించి ఉన్నాడని చెప్పారు. మృతుడి నడుముకి మలతాడు, మరో తాడుతో గోనెసంచిలో రాళ్లతో కట్టి పడేశారు. నదీతీరం వెంట స్థావరాలు ఏర్పాటు చేసుకొని చేపల వేట సాగిస్తున్న మత్స్యకారులను విచారిస్తామని పోలీసులు తెలిపారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలి: కమిషనర్



కమిషనర్‌కు సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి 14 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్‌ఓ జునైద్, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివా సులు ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఇంజనీర్లు శ్రీనివాసులు, నరేంద్రనాథ రెడ్డి, ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు, ఆర్‌ఐ పాణ్యం శ్రీనివాసులు, ఏపీఎం వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

గూడూరు: ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. సోమవారం గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ ప్రజల నుంచి ఆర్జీలు స్వీకరించారు.

అప్రమత్తంగా విధులు నిర్వహించాలి: ఎస్పీ

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నేరాలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం స్థానిక నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రాత్రి గస్తీ పెంచాలన్నారు. కార్యక్రమంలో ఫోర్త్‌టౌన్ సీఐ మధుసూదన్‌గౌడు, ఎస్‌ఐలు షమీర్ బాషా, చంద్రశేఖర్, గోపీనాథ్, పోలీసులు ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై పోలీసులు కొరడా ఝుళిపించారు. సోమవారం రాత్రి త్రీటౌన్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు కూడళ్లలో డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో 16 మందిపై కేసులు నమోదు చేశా రు. వీరిని కోర్టులో హాజరు పరచగా.. 6 మంది డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేయగా.. ఒక్కొక్కరికి రూ.3వేల చొప్పున జరిమానా విధించారు. అలాగే 10 మందిపై ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేయగా.. వీరికి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున జరిమానా విధించారు.

విదేశీ పెట్టుబడులను వ్యతిరేకించండి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఇన్సూరెన్సు రంగంలో విదేశీ పెట్టుబడులను వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు అన్నారు. సోమవారం ఎల్‌ఐసీ కార్యాలయంలో ఈనెల 20 దేశవ్యాప్తంగా జరిగే నిరసన కార్యక్రమాలకు సంబంధించి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్సూరెన్సు రంగంలో వంద శాతం విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తూ బడ్జెట్‌లో ప్రతిపాదించడం దారుణమన్నారు. పోస్టులను భర్తీ చేయాలని, ఆలిండియా ఇన్సూరెన్సు ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు గుర్తింపు ఇవ్వా లని కోరుతూ ఈనెల 20న ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా జిల్లా వ్యాప్తంగా అన్ని బ్రాంచీల వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, నగర నాయకులు మహ్మద్‌రఫి పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి పరుచుకోవాలి

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి పరుచుకోవాలని క్లస్టర్ ప్రిన్సిపాల్ అన్వర్ బాషా అన్నారు. సోమవారం స్థానిక మాధవనగర్‌లోని నారాయణ పాఠశాలలో జాతీయ స్థాయిలో సాఫ్ట్ స్కిల్స్ మెగా యాక్టివిటీ మేళాలను ప్రిన్సిపాల్ మహ్మద్ ఆల్తాఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రీజనల్ స్టాఫ్ స్కిల్స్ ట్రైనర్ ప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో సాఫ్ట్‌స్కిల్స్ ట్రైనర్ షైనీ పాల్గొన్నారు.

తైక్వాండో గ్రేడింగ్ బెల్టుల ప్రదానం

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో తైక్వాండో క్రీడాకారులకు గ్రేడింగ్ బెల్టులు ప్రదానం చేశారు. ఈకార్యక్రమానికి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు హాజరై క్రీడాకారులకు బెల్టులను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు, కొండేపోగు చిన్న సుంకన్న, షకీల్ పాల్గొన్నారు.

డీఎస్‌ఏ స్టేడియంలో 'స్వచ్ఛాంధ్ర'

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ సందర్భంగా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు ఆధ్వర్యంలో క్రీడా మైదానంలో శుభ్రం చేశారు. డీఎస్‌ఏ సిబ్బంది, కోచ్‌లు పాల్గొన్నారు.

రేపు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సీనియర్ మహిళలు, జూనియర్స్ బాలుర ఉమ్మడి జిల్లాల హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నంద్యాల జిల్లా ఆర్జీఎం కళాశాల మైదానంలో ఈనెల 19న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి రుద్రారెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో జూనియర్ బాలురుకు 1.1.2005తర్వాత జన్మించిన వారు అర్హులు అని తెలిపారు. వివరాలకు 9940222232, 7013111743ను సంప్ర దించాలన్నారు.

సినీ నటి కృష్ణవేణి సేవలు చిరస్మరణీయం

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తెలుగు చలనచిత్ర సీమకు తొలి మహిళా నిర్మాత, సినీ నటి కృష్ణవేణి సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని పలువురు రంగ స్థల కళాకారులు, గాయకులు కొనియాడారు. కృష్ణవేణి మృతికి జిల్లాకు చెందిన పలు కళాసంస్థల ప్రతినిధులు, గాయకులు వేర్వేరు ప్రకటనల్లో తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. రఘుపతి వెంకయ్య అవార్డు గ్రహీత సి.కృష్ణవేణి జీవితం ఆదర్శప్రాయమని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఒక ప్రకటనలో ఆమెకు నివాళులు అర్పించారు. నటి కృష్ణవేణమ్మ 102 ఏళ్ల ఆరోగ్యంగా జీవించారంటే ఆమె ఆరోగ్య రహస్యాలు తెలుసుకొని ప్రతి కళాకారుడూ వాటిని పాటించాలని టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు పి. హనుమంతరావు చౌదరి, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మీ పద్మాచౌదరి అన్నారు. కృష్ణవేణికి తాను రాసిన పంచరత్న మాల (సన్మానపత్రం) రాసే అవకాశం కలిగిందని తెలుగు కళాసమితి కార్యదర్శి ఎలమర్తి రమణయ్య గుర్తు చేసుకున్నారు. ఎన్టీ రామారావును, అమర గాయకుడు ఘంటసాల (సంగీత దర్శకునిగా) పరిచయం చేసిన ఘనత కృష్ణవేణమ్మకు దక్కుతుందని పద్మశ్రీ ఘంటసాల గానకళా సమితి సభ్యులు వాసుదేవమూర్తి, ప్రముఖ వైద్య నిపుణులు పి.చంద్రశేఖర్, డబ్ల్యూ సీతారాం, భవానీప్రసాద్, శంకరశర్మ, సాయికుమార్, ఉమానాథరావు, సిపి నగేష్ ఒక ప్రకటనలో కొనియాడారు. సినీ వినీలాకాశంలో కృష్ణవేణి ఒక ధ్రువతారగా నిలిచిపోతారని, స్టూడి యో అధినేతగా ఆమె మరపురాని చిత్రాలు నిర్మించారని ఘంటసాల గానకళా సమితి అధ్యక్షుడు బీఎస్ రావు కొనియాడారు.

రోగుల దాహార్తిని తీర్చేందుకే ఆర్వో ప్లాంట్లు

పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రోగుల దాహార్తిని తీర్చేందుకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అదనంగా రెండు ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేశామని రాష్ట్ర పరిశ్రమ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం కర్నూలు జీజీహెచ్‌లోని సదరం క్యాంపు, ఓపీ నెంబరు 9 వద్ద కోకోకలా బేవరేజెస్ కంపెనీ ద్వారా సీఎస్ఆర్ నిధుల కింద రూ.2.60 లక్షలతో ఏర్పాటు ఏసిన రెండు మినరల్ వాటర్ ప్లాంట్లను మంత్రి, కలెక్టర్ పి.రంజిత్ బాషాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ రానున్న వేసవి కాలంను దృష్టిలో పెట్టుకుని ఆసుపత్రికి వచ్చే రోగులకు తాగునీటిని ఎలాంటి ఇబ్బంది ఉండకూడదనే ఉద్దేశంతో అదనంగా రెండు మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సి పాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు, సీఎస్ఆర్ఎంవో బీవీ రావు, అడ్మినిస్ట్రేటర్ సిందుసుబ్ర హ్మణ్యం, కోకోకోలా కంపెనీ మేనేజర్ ముకుంద్ త్రివేది పాల్గొన్నారు.

● కంటి ఆసుపత్రి తనిఖీ: కర్నూలు ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రిని మంత్రి, కలెక్టర్ తనిఖీ చేశారు. రోగులు ఇబ్బంది పడకుండా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మంత్రి వైద్యులను ఆదేశించారు. సాంకేతిక పరికరాలను పరిశీలించి వాటి పనితీరును కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు అడిగి తెలుసుకు న్నారు.

● నగరంలోని బుధవారపేట, ఇందిరాగాంధీనగర్‌లో కోకోకోలా బేవరే జెస్ కంపెనీ ద్వారా సీఎస్ఆర్ నిధులతో పునరుద్ధరించిన అంగన్‌వాడీ కేంద్రాలను మంత్రి, కలెక్టర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం మంత్రి, కలెక్టర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతో ముచ్చటించారు.

దాడులను అరికట్టడంలో విఫలం

ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి సుజాత



మాట్లాడుతున్న సుజాత

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో హోంమంత్రి అనిత విఫలమైం దని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి సుజాత విమ ర్శించారు. సోమవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా రాష్ట్రంలో ప్రతి రోజు ఏదో ఒక ప్రాంతంలో మహిళలపై దాడులు, హత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. మహిళలపై దాడులు జరగకుండా ఉండాలంటే ప్రత్యేక పోలీసు వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను తక్ష ణమే అమలు చేయాలన్నారు. ఈసమావేశంలో సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గిడ్డమ్మ, పి.శ్రావణిరెడ్డి, సహాయ కార్యదర్శి రేణుక, వి.భారతి, పావని, మునెమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు న్యాయం చేయాలి

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్ర శిక్ష కార్యాలయాల్లో ఆన్ డ్యూటీ మీద పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, హెచ్ఎంలు, ఎంఈవోలను జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ వారిని రిలీవ్‌చేసి పదో తరగతి విద్యార్థులకు న్యాయం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్ కలెక్టర్ రంజిత్ బాషాకు వినతిపత్రం అందజేశారు. పది పరీక్షలు సమీపిస్తున్న వేళ సంబంధిత పాఠశాలలో సబ్జెక్టు టీచర్లు లేరని విద్యార్థులు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం, సమగ్ర శిక్ష కార్యాలయంలో ఉపాధ్యాయులు ఆన్ డ్యూటీ మీద పని చేస్తున్నామని, అందువల్లనే పాఠశాలలకు వెళ్లలేకపోతున్నామని ఉపాధ్యాయులు సమాధానం చెబుతున్నారని అన్నారు. గోనెగండ్ల మండలం పెద్దమర్రివీడు ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు లేక పది విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు.

● కౌతాళంలో నకిలీ కులధ్రువీకరణ పత్రం మంజూరు చేసిన రెవెన్యూ అధికారులను సర్వీసు నుంచి తొలగించాలని కోరుతూ సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరుకుల రాజు కలెక్టర్ రంజిత్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. కౌతాళం మండలంలో గతంలో పని చేసిన తహసీల్దార్ కె.మల్లికార్జున స్వామి, డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌ఐ వీరేంద్రగౌడు, బదినేహాల్ గ్రామానికి సంబంధించిన మండల ఆర్‌ఐ రాజశేఖర్ గ్రామ వీఆర్వో సూర్య, నారా యణరెడ్డిలతో కలిసి కల్లూరు మండలం పెద్దపాడు గ్రామానికి చెందిన షెడ్యూల్ కులానికి చెందిన నలగోడి శ్రీనివాసులు, సెకండరీ గ్రేడ్ టీచర్ కు ఎస్టీ గురుకుల కులధ్రువీకరణ పత్రం మంజూరు చేశారని, రెవెన్యూ అధికారులను సర్వీసు నుంచి తొలగించాలని కోరారు.

● మంత్రాలయం మండలం చెట్నహళ్లి గ్రామ శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలని జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కిం జానయ్య జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ముత్తుసుమాల, ప్రశాంత్ కుమార్, హనుమన్న పాల్గొన్నారు.

● నగర పాలక సంస్థ పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీ సమీపంలో స్వాతంత్ర సమరయోధులు పుచ్చాలపల్లి సుందరయ్య పార్కును పునర్నిర్మాణం చేపట్టాలని సోమవారం పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పుల్లారెడ్డి, ఎం.నాగరాజు, సీవీ వర్మ జిల్లా కలెక్టర్‌ను కోరారు.

● జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పబ్లిక్ పరీక్ష నిర్వహణలో మాస్ కాపీయింగ్‌కు సహకరిస్తున్న సిబ్బందిపై విచారించి క్రిమినల్ కేసు నమోదు చేయించాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఖాజా, కృష్ణలు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఎమ్మిగనూరు పరిధిలోని ప్రైవేటు కార్పొరేట్ జూనియర్ కళాశాల యజమాన్యాలతో కొందరు జూనియర్ లెక్చరర్స్ లోపకారి ఒప్పందంతో సుమారు 13 సంవత్సరాల నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలో మాస్ కాపీయింగ్‌కు సహకరిస్తున్నారని ఆరోపించారు.



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

● మద్దికెర మండలం కెనరా బ్యాంకు మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన జానకి, సరోజ, చిట్టెమ్మలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మద్దికెరలోని కెనరా బ్యాంకులో తాము పీఎంఈజీసీ స్కీం కింద లోన్‌కు దరఖాస్తు చేసుకున్నామన్నారు. మీకు సివిల్ స్కోర్ ఉన్నది కావున లోన్ ఇస్తామని బ్యాంకు మేనేజర్ హామీ ఇచ్చారన్నారు. కానీ మరలా బ్యాంకు దగ్గరకు వెళితే.. మీకు లోను ఇవ్వడం జరగదని ఎవరికైనా చెప్పుకోండని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి



కర్నూలులో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు



కోడుమూరులో సీడీపీవో కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు అర్బన్ సీడీపీవో కార్యాల యం దగ్గర బాలదుర్గమ్మ అధ్యక్షతన ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 42 రోజులు సమ్మె చేసిన గత ప్రభుత్వం వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిందని, కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఆ హామీని నెరవేర్చలేదని అన్నారు. అంగన్‌వాడీలకు ఒకే యాప్‌గా మార్పు చేయా లని, సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రేణుకమ్మ, నాయకులు నాగమణి, సునీత, సరళ, కృష్ణవేణి పాల్గొన్నారు.

● **అసెంబ్లీలో చర్చించాలి:** ఈ నెల 25 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో అంగన్‌వాడీ వర్కర్స్ వేతనాలు పెంచేవిధంగా చర్చించాలని మంత్రి టీజీ భరత్‌కు ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.లలితమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి చౌడేశ్వరి, ఏఐటీయూసీ నాయకులు మునెప్ప పాల్గొన్నారు.

కోడుమూరు: అంగన్‌వాడీ వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీడీపీవో కార్యాలయం ముందు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, యాప్‌ల పేరుతో అంగన్‌వాడీలు ఒత్తిడికి లోనవుతున్నార న్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న భవనాల అద్దెలు, టీఏ బిల్లులు, ఉచితంగా గ్యాస్ సరాఫర, అర్హులైన ఆయాలకు ప్రమోషన్ ఇవ్వాలన్నారు. అనంతరం సీడీపీవో కార్యాలయ సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జీపీ వీరన్న, మోహన్ అంగన్‌వాడీ వర్కర్లు సూలమ్మ, అరుణ, సుజాత, హైమావతి, ఫాతిమా, సునంద, రామాంజనమ్మ పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

● పందిపాడులో క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే గౌరు చరిత



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపోటములను సమానం స్వీకరించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం పందిపాడులో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ మహాశివరాత్రి వేడుక సందర్భంగా రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్న గ్రామస్థులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం క్రికెట్ బ్యాట్‌పట్టి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్ యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, వాకిటి మాదేశ్, శేఖర్‌చౌదరి పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఆర్‌ఐ, ప్రిన్సిపాల్

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సంకల్ భాగ్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో క్యాట్ లెవల్-2 పరీక్షలో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సోమవారం పాఠశాలలో అభినందన సభలో ప్రతిభ కనబర్చిన 116 మంది విద్యార్థులకు ఆర్‌ఐ సీతారామిరెడ్డి, ప్రిన్సిపాల్ రమా నగదు బహుమతులు, మెడల్స్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థులను, ఉపాధ్యాయులను ఏజీఎం సురేష్ అభినందించారు.

ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న నేనావత్ రాముా నాయక్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): హౌసింగ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఏజెన్సీకి అప్పజెప్పాలని ప్రభుత్వం ఆలోచిస్తుందని, దానిని ఉపసంహరించుకోవాలని హౌసింగ్ డిపార్టుమెంటు జిల్లా అధ్యక్షుడు నేనావత్ రాముా నాయక్ అన్నారు. సోమవారం ఓర్వకల్లులోని హౌసింగ్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హౌసింగ్ సంస్థలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో దాదాపు 2500 ఉద్యోగులు పని చేస్తు న్నారన్నారు. హౌసింగ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఏజెన్సీకి అప్పజె ప్పాలని ప్రభుత్వం ఆలోచిస్తుందని, ఈ నిర్ణయాన్ని మానుకోవాలని కూట మి ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా సభ్యులు సత్యన్న, సుగుణ మ్మ, రమేష్ పాల్గొన్నారు.

'కామన్ పీజీ సెట్‌ను రద్దు చేయాలి'

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కామన్ పీజీ సెట్‌ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న డిమాండ్ చేశారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీ ఎదుట జిల్లా కార్యదర్శి షాబీర్‌బాషాతో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77ను వెంటనే రద్దు చేయాలని, ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీల ను మంత్రి నారా లోకేష్ నిలబెట్టుకోవాలని కోరారు. 2021 ముందు పీజీ సెట్‌ల నిర్వహణ ఏ యూనివర్సిటీకి ఆ ఆయూనివర్సిటీ పీజీ ప్రవేశాలు నిర్వహించే వారని, వైసీపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం పేరుతో కామన్ పీజీ ప్రవేశాలు ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహించే సాంప్రదాయానికి తెరలేపిందని అన్నారు. అభి, సిద్దు, అరవింద్, హేమంత్, వెంకటేష్ పాల్గొన్నారు.

తూకాల్లో తేడాలు వస్తే చర్యలు

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 17: తూకాల్లో తేడాలు వస్తే చర్యలు తప్పవని మార్కెట్ యార్డు అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్ హెచ్చరించారు. సోమవారం వెంకటేశ్‌తోపాటు సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నాగేష్‌పంట ఉత్పత్తులను తూకాలు వేసే సమయంలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కమీషన్ ఏజెంట్లను మందలించారు.

పుల్లారెడ్డి కళాశాలలో

విజ్ఞాన మేళా ప్రారంభం

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన విజ్ఞాన మేళాను ఐఏఎస్ మురళీధర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో వివిధ ప్రాంతాల నుంచి 3,500లకు పైగా విద్యార్థులు పాల్గొన్నారు. వెల్‌కం రోబోట్, ఏఆర్/వీఆర్ స్టూడియో, శ్రీశైలం డ్యాం, ఫొటో బూత్‌లు సంద ర్శకులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు వివిధ రంగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఫుడ్ స్టాల్స్, సైన్స్ ప్రాజెక్టులు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, గేమ్స్ అండ్ ఫన్స్ వంటి విభిన్న కేటగిరీలో స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన 19వ తేదీ వరకు కొనసాగుతుంది.

హామీల అమలులో విఫలం: కాంగ్రెస్

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని చెందిందని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు జీలానీ బాషా అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 18న కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపునిచ్చారని తెలిపారు. ప్లేట్లు, గరిటేలు పట్టుకుని శబ్దం చేస్తూ చేపట్టే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సుధాకర్ బాబు, బీ బతుకన్న, అనంతరత్నం మాదిగ, లాజరస్ పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

కర్నూలు రూరల్ ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, బ్యాంకులో తీసుకున్న రుణా లను మాఫీ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యం లో సోమవారం కర్నూలు ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా చేశారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కర్నూలు రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రధానంగా పత్తి, కంది, జొన్న, ఆముదాలు, శనగలు, మిరప వంటి పంటలు వేశారని, సకాలంలో వర్షాలు పడకపోవ డంతో పంట దిగుబడులు అంతంత మాత్రమే వచ్చాయని తెలిపారు. వచ్చిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేవని దీంతో రైతులు తెచ్చిన అప్పులు తీర్చలేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్‌కు వినతిప త్రం సమర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నాగన్న, ఆంజనేయులు, బాలపీరా, వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, మధు, మధు సూదన్ పాల్గొన్నారు.

'అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి'

కల్లూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం పార్టీ న్యూసిటీ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం పెద్దపాడు సీపీఎం కార్యదర్శి గోపినాథ్ అధ్యక్షతన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సచివాలయం ముందు నిర్వహించిన ఆందోళనలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏళ్ల తరబడి సొంతిళ్లు లేక ఉమ్మడి కుటుంబాల్లో నివసిస్తూ ఇబ్బందులు పడుతున్న వారు పెద్దపాడులో అనేక మంది ఉన్నారన్నారు. అనంతరం సచివాలయ ఉద్యోగులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీను, ఏసు, రాజు, వరలక్ష్మీ, కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: అర్హులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం 48వ వార్డు అమీర్ హైదర్‌నగర్, దౌలత్‌నగర్, రోజీ వీధిలో సచివాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారమే పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో నాయకులు మహబూబ్‌బాషా, షానాజ్, బి.లక్ష్మీదేవి, సరిత, శివయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

శ్రీశైలానికి తరలిన శివస్వాములు

గూడూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మహాశివ రాత్రి పర్వదినాన శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు శివస్వాములు ఇరుముడి ధరించి శ్రీశైలానికి పాదయాత్రగా తరలి వెళ్లారు. సోమవారం గూడూరులోని నీలకంఠేశ్వరుని ఆలయంలో శివస్వాములు భక్తిశ్రద్ధలతో స్వామి అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన మహా మంగళ హారతి నిర్వహించారు. అనంతరం ఇరుముడి ధరించి పాదయాత్రగా శ్రీశైలానికి తరలివెళ్లారు. కార్యక్రమంలో ఆలయ పురోహితుడు నాగరాజు, శివస్వాములు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించకపోతే రైతులకే నష్టం

తుగ్గలి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సొసైటీల్లో తీసుకున్న రుణాలను చెల్లించకపోతే రైతులు నష్టపోతారనీ సొసైటీ సీఈవో మనోహర్ నాయుడు, రికవరీ అధికారి జయప్రకాష్ అన్నారు. సోమవారం మారెళ్ల అశోక సొసైటీలో రుణాలు తీసుకుని బకాయిలు పడ్డ ఎద్దుల దొడ్డి, పెండేకల్, బొంతిరాళ్ల, రాంపల్లి, మారెళ్ల, బొందిమడుగుల గ్రామాల్లోని 68 రైతులకు పొలాలను వేలం వేసేందుకు నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నోటీసులు అందిన నెల రోజుల్లోపు వడ్డీలు చెల్లించి రెన్యువల్ చేసుకోవాలన్నారు. అలా చేయకపోతే వేలం ప్రక్రియ జరుగుతుందని, వేలం వేసి పొలాలను అమ్మివేసి సొసైటీ బకాయిలను కట్టించుకుంటామన్నారు. రైతులు నిర్లక్ష్యం చేయకుండా రుణాలు చెల్లించాలని కోరారు.

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు సిద్ధం


సిద్ధమైన వేదిక

తుగ్గలి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జియో మైసూరు కంపెనీ కోసం మంగళవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు సిద్ధం చేశామని, జియో మైసూరు కంపెనీ పీఆర్వో సోమిరెడ్డి రామోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం జొన్నగిరి వద్ద జియో మైసూరు కంపెనీ పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కోసం సభను నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి జిల్లా పర్యావరణ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు రైతులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొంటారన్నారు.

'బీసీల కోసం ఆవిర్భవించిన టీడీపీ'

మద్దికెర, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల కోసం తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందని మాజీ జడ్పీటీసీ సభ్యులు పి.పురుషోత్తం చౌదరి అన్నారు. సోమవారం మండలంలోని పెరవలి గ్రామంలోని బస్టాండు వద్ద తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహ ఏర్పాటు చేసేందుకు పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ దేవాలయ ఛైర్మన్ ఆంజనేయ, మెడికల్ రాము, నాగేంద్రగౌడు, ఉన్నారు.

వైభవంగా మస్తాన్‌వలి ఉరుసు

దేవనకొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపేట లో మస్తాన్‌వలి ఉరుసు మహోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం నుండి ప్రారంభమైన ఉరుసు వేడుకలలో భాగంగా సోమవారం తెల్లవారుజామున స్వామి వారి అశ్వం గ్రామంలో తిరిగి దర్గాకు చేరుకొంది. జిల్లా నుంచే కాక కర్ణాటక, తెలంగాణ నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం దర్గాలో ప్రత్యేక పాతేహాలు నిర్వహించారు.

జొన్నలు కొనుగోలు చేస్తాం


విశిష్ట సంఖ్య నమోదు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏవో రవి

మద్దికెర, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులు పండించిన జొన్నలు నిల్వ ఉంటే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామని వ్యవసాయ శాఖ మండల అధికారి రవి అన్నారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో పడిపోయన జొన్న ధర అను వార్తకు స్పందించిన ఏవో రవి మాట్లాడుతూ మార్క్‌ఫెడ్ వారు కొనుగోలు చేస్తామని తమ దృష్టికి వచ్చారన్నారు. రైతుల దగ్గర జొన్నలు నిల్వ పంట ఉంటే మాకు సమాచారం ఇస్తే ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం కొనుగోలు చేస్తామని అన్నారు. రైతులు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. 28లోపు ఆధార్ వలే 14 అంకెల విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలన్నారు. మండలంలో మొత్తం 6వేల మంది రైతులు ఉన్నారనీ, ఇప్పటి వరకు 3వేల మంది రైతులకు సంబంధించి విశిష్ట సంఖ్యకు నమోదు చేశామని అన్నారు. ఇంకా మూడు వేల మందికి నమోదు చేయాలని, రైతులు ఆధార్ కార్డు తీసుకువచ్చి చేయించుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఈవో బోజరాజు, జాకీర్ ఉన్నారు.

చిన్నారులకు ఆధార్‌కార్డు తప్పనిసరి


సూపర్‌వైజర్లతో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఆదోని రూరల్ : ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడిపాఠశాలలకు వెళ్తున్న చిన్నారులకు తప్పనిసరిగా ఆధార్ ఉండాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భార్గవి, పుష్ప, సావిత్రి, లీలావతి తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు అందించే పౌష్టికాహారం అమలు కావాలంటే అంగన్‌వాడీ కేంద్రాలకెళ్లే చిన్నారులకు తప్పనిసరిగా ఆధార్ ఉండాలన్నారు. రూరల్ ఐసీడీఎస్ పరిధిలో నాలుగు సెక్టార్లలో 98 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయని, ఇందులో 0నుంచి 6సంవత్సరాల చిన్నారులు 10వేల 706మంది ఉన్నారని, ఇందులో 4148మంది విద్యార్థులకు ఆధార్ కార్డు లేదన్నారు. కాబట్టి సంబంధిత తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆధార్ తీయించాలన్నారు.

గద్దెరాళ్ల మారెమ్మ టెంకాయల వేలం

దేవనకొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గద్దెరాళ్ల మారెమ్మ ఆలయంలో టెంకాయల వేలంపాట నిర్వహించినట్లు ఆలయ అధికారి వీరయ్య తెలిపారు. వేలం పాటలో ఏడుగురు పాల్గొన్నగా చిన్న నేట్టే కల్లు అనే వ్యక్తి రూ.6 లక్షలకు దక్కించుకున్నాడు. హుండీని లెక్కించగా రూ.4,11,837 వచ్చిందన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి టీవీ నర్సయ్య, సిబ్బంది బాల చెంచన్న పాల్గొన్నారు.

రథోత్సవంలో అపశ్రుతి

● బాణసంచా కాలుస్తుండగా

గడ్డివాములకు నిప్పు

హొళగుంద, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : హొళగుంద మండలం వందవాగాలి గ్రామంలోని వీరభద్రేశ్వర స్వామి రథోత్సవం కార్యక్రమంలో అపశ్రుతి చోటు చేసుకుంది. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. స్వామివారి జాతర సందర్భంగా రథోత్సవంలో బాణసంచా కాలుస్తుండగా ప్రమాదవశాత్తు దురూరు యంకప్ప అనే రైతు మూడు గడ్డి వాములు అగ్నికి కాలి బూడిద అయ్యాయి. పక్కనే మరో ఏడు గడ్డి వాములకు అంటుకోకుండా అగ్నిమాపక శాఖ అధికారులు మంటలను అదుపు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.




ఆలూరు, పత్తికొండలో ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

అంగన్‌వాడీ ఉద్యోగులకు వేతనాలు పెంచాలి

ఆలూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ ఉద్యోగుల సేవలను పరిగణలోకి తీసుకొని వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా నాయకులు నారాయణస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సీడీపీవో శశికళకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు డీవైఎఫ్ఐ నాయకులు షైనా, గోవర్ధన్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు మాల రంగమ్మ, సరస్వతి, లక్ష్మి, సుజాతమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఆస్పరి: అంగన్‌వాడీ వేతనాలు పెంచాలని వేతనాల పెంచాలని ఏఐటీయూసీ తాలూకా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణమూర్తి, రంగన్న, భూపేష్ అన్నారు. సోమవారం ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే విరుపాక్షికి స్వగృహంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం 2023 డిసెంబరు నుండి 2024 జనవరి 22 వరకు రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. కార్యక్రమంలో చిట్టెమ్మ, జయలక్ష్మి, సరస్వతి, రాణి, రాజమ్మ పాల్గొన్నారు.

ఆదోని టౌన్: అంగన్‌వాడీలకు వేతనాలు రూ. 26వేలకు పెంచాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీడీపీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కె వెంకటమ్మ, సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, గోపాల్, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు వరలక్ష్మి మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సోమక్క, రిజ్వాన్, మీనా కుమారి, గీత, లలిత, లక్ష్మీదేవి, కరుణ, ఉషారాణి పాల్గొన్నారు.

పత్తికొండటౌన్: అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని సీఐటీయూ నాయకులు గోపాల్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కాంతమ్మ, పద్మజలు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఈశ్వర్‌రెడ్డి భవన్ నుంచి సీఐటీయు ఆధ్వర్యంలో అంగన్‌వడీలు పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఐసీడీఎస్ అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు ఉమామహేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

ఆదోని, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం పిజిఆర్ఎస్ డేలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులను సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ, గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్‌ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు.

● ఆదోని మండలం నెట్టేకల్లు గ్రామానికి చెందిన హరిసింగ్ సంబంధించి విద్యుత్ పోల్ కోసం చలానా చెల్లించా. ఇప్పటివరకు విద్యుత్ పోల్ ఏర్పాటు చేయలేదని అర్జీ ఇచ్చారు.

● ఇంటి నిర్మాణానికి విద్యుత్ తీగలు అడ్డుగా ఉన్నాయని, వాటిని తొలగించాలని ఆదోని మండలం జాలిమంచి గ్రామానికి చెందిన మలకన్న అర్జీ ఇచ్చారు.

● ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన రమేష్‌కు సంబంధించి సర్వే నెం.16/ఏలో 4 ఎకరాల భూమి మా పెద్దల నుంచి వచ్చిందని, ప్రస్తుతం సదరు భూమిలో 1.57 ఎకరాల భూమిని పక్క ఉన్న పొలం వారు కబ్జా చేశారని, విచారణ చేసి న్యాయం చేయాలని అర్జీ ఇచ్చారు.

● ఆదోని మండలం ఆరేకల్ గ్రామం ఎల్లారెడ్డి సంబంధించి సర్వే నెం.167/బిలో 14.91 ఎకరాల భూమి ఉందని, భూమి రీ సర్వే జరిగిన తరువాత 12.60 ఎకరాల మాత్రమే భూమి ఉందని, మిగిలిన 2.31 ఎకరాల భూమిని విచారణ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ సమర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ శ్రీనివాస్‌రాజు, వేణుసూర్య, డిఎల్‌పీవో నూర్జహాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటీవ్ ఈఈ పద్మజ, డిప్యూటీ డిఎంహెచ్‌వో సత్యవతి, డీఈవో వెంకటరమణారెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు


ఎంపీడీవో కార్యాలయం వద్ద అధికారుల కోసం ఎదురుచూస్తున్న ప్రజలు

11 గంటలైనా అధికారులు రాలేదు..

హొళగుంద: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి సోమవారం అధికారులు 11 గంటలైన ఏ ఒక్క అధికారి హాజరు కాలేదని ప్రజలు ఆరోపించారు. వారం రోజులకు ఒక్కసారి అన్ని శాఖలకు చెందిన అధికారులు ఒక్కచోట ఉంటే సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే ఇలా అధికారులు హాజరు కాకపోతే ఎలా సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో విజయ లలితను వివరణ కోరెందుకు ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

మిర్చి రైతులను ఆదుకోండి

ఆదోని రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం రైతులతో కలిసి నాయకులు తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మిర్చి రైతుల కష్టాలను ప్రభుత్వానికి కనపడదా అని ప్రశ్నించారు. వాతావరణ పరిస్థితులతోపాటు మిర్చికి గిట్టుబాటు ధర లేక రైతులు కన్నీళ్లు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మిర్చి రైతులను ఆదుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ శివరాముడుకు వినతిపత్రం సమర్పించారు.

దేవనకొండ: మిర్చి పంటకు మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరేశకర్ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయలం ఎదుట వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మండలంలో నాలుగువేల ఎకరాలలో మిర్చి సాగు చేశారని, పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదన్నారు. కింటం ధర రూ.12 వేలకు మించి పలుకడం లేదన్నారు. బాడిగ మిర్చి రూ.50 వేలు, గుంటూరు మిర్చికి రూ.25 వేలు మద్దతు ధర ప్రభుత్వం కల్పించి కొనుగోలు చేయాలన్నారు. సమస్యలతో కుడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు ఇచ్చారు. నాయకులు బజారి, మహబుబ్‌బాషా, పాండు, తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ శివరాముడుకు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

గడ్డివాములు దగ్ధం: రూ.10 లక్షలు నష్టం



మద్దికెర, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మద్దికెర గ్రామ శివారులోని బైలు స్థలాల్లో పశువుల పెంపకానికి నిల్వ ఉంచుకున్న పశుగ్రాసం గడ్డివాములు దగ్ధం కావడంతో రూ.10లక్షలు నష్టం వాటిల్లింది. సోమవారం తెల్లవారుజామున సుమారు 2 గంటల ప్రాంతంలో గ్రామానికి చెందిన పార్వేటుమిట్ట వద్ద నివసిస్తున్న రైతులు పెద్దరంగస్వామి, చిన్న రంగస్వామి, మల్లికార్జున, ఈరన్న, రాముడు, హనుమంతు, ప్రసాద్ మాణిక్యం, నాగప్ప అనే రైతుల గడ్డివాములకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. గ్రామ శివారులో ఈ గడ్డివాములు ఉండటంతో మంటలు ఎగిసిపడి రైతులు వెళ్లేలోపు మొత్తం కాలి బూడిదైంది. ఫైరింజన్ వచ్చి మరింత ఎక్కువ నష్టం జరగకుండా మంటలను ఆర్పేసింది. ఎస్ఐ విజయకుమార్ నాయక్, వీఆర్వో శ్రీరాములు సంఘటనా స్థలానికి చేరుకుని అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు.

● **పశువులకు పశుగ్రాసం విరాళం:** గడ్డివాములు కాలిపోవడంతో బాధితులకు ఆరు ఎద్దుల బండ్ల మేతను అందించనున్నట్లు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

విద్యారంగ సమస్యలపై ఉద్యమాలకు సిద్ధం కావాలి


నూతనంగా ఎన్నికైన ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలపై విద్యార్థులు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన అధ్యక్షుడు అబ్దుల్లా, జిల్లా కార్యదర్శి రంగప్ప కోరారు. సోమవారం ఎస్ఎఫ్ జిల్లా మహాసభల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అబ్దుల్లా, జిల్లా కార్యదర్శిగా రంగప్ప, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, సాయి, ఉదయ్, విజయ్ సంయుక్త జిల్లా సహాయ కార్యదర్శిగా రంజిత్, అమర్, అంజితో పాటు 18 మందిని ఏకగ్రీవంగా సభ్యులుగా ఎన్నుకున్నారు. ఆదోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటీకరిస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పక్కా భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు.

దోబీ ఘాట్లలో ఆధునిక యంత్రాల ఏర్పాటుకు కృషి

● రజక కార్పొరేషన్ చైర్ పర్సన్


ఆధునిక యంత్రాలను పరిశీలిస్తున్న చైర్ పర్సన్ సావిత్రి

ఆదోని టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రజకుల సౌకర్యార్థం దోబిఘాట్లలో ఆధునిక యంత్రాలను ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని రాష్ట్ర రజక వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్ పర్సన్ సావిత్రి అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని సిరిసిల్ల పట్టణంలో రజకుల కోసం ఏర్పాటు చేసిన ఆధునిక యంత్రాలను, వాటి పని తీరును అక్కడి రజక నాయకులతో కలిసి పరిశీలించానని తెలిపారు. వీటి ఏర్పాటుతో రాష్ట్రంలోని రజకుల పనితీరు ఎంతో మెరుగుకావడానికి అవకాశం ఉందన్నారు. దోబీ ఘట్ల ఆదునికీకరణ కోసం కృషి చేస్తానన్నారు.

ఆదోనిలో ఏసీబీ అధికారులు?

ఆదోని రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ గ్రామానికి చెందిన రైతు తన భూమి సర్వే కోసం సర్వేయర్‌తో పాటు తలారి తనవద్ద రూ.10వేలు లంచం తీసుకున్నారని వారం క్రితం సీఎంవో అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఏసీబీ అధికారులు విచారణలో భాగంగా ఆదోనికి వచ్చినట్లు సమాచారం. ఏసీబీ అధికారులు ఆదోనికి వచ్చారనే విషయం తెలియడంతో ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు కార్యాలయాలు ఖాళీ చేసి వెళ్లిపోయారు. అయితే ఏసీబీ అధికారులు ఓ మేజర్ గ్రామ పంచాయతీ వీఆర్‌ఓను ట్రాప్ చేయడానికి వచ్చారని కూడా తెలుస్తోంది.

పేకాటరాయుళ్ల అరెస్టు

పత్తికొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ పట్టణంలోని ట్రాన్స్‌కో కార్యాలయం ఎదురుగా రెండు వేర్వేరు చోట్ల పేకాడుతున్న 11మందిని అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.12వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జయన్న తెలిపారు. క్రిష్టారెడ్డి, వెంకటేష్, కంబగిరిలతోపాటు మరో 8మందిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

ప్రైవేటు ఏజెన్సీల ద్వారా పోస్టుల భర్తీ తగదు

ఆలూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ శాఖల్లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా భర్తీ చేయాలనే రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయం సంజసమం కాదని ఏపీ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర నాయకులు మొహమ్మద్ రఫీ సోమవారం అన్నారు. ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నియామకాలు జరిపితే, పారదర్శకత లోపించి, నిజమైన మెరిట్ ఉన్న అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వమే నేరుగా నియమాక ప్రక్రియ నిర్వహించి, ఆంధ్రప్రదేశ్ కార్పొరేట్ అవుట్ సోర్సింగ్ సంస్థ ద్వారా ఉద్యోగులను నియమించాలని డిమాండ్ చేశారు.

బండల లోడు లారీ బోల్తా

ఆస్పరి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అలిగేరి-చిగిలి బస్టాండ్ వద్ద బండల లారీ సోమవారం అదుపుతప్పి బోల్తా పడింది. పత్తికొండ నుంచి ఆదోని వైపుకు వెళుతుండగా లారీ బోల్తా పడినట్లు సీఐ మస్తాన్ వలి తెలిపారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

మహిళ ఆత్మహత్య

హొళగుంద, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దహ్యాట గ్రామానికి చెందిన చలువాది యశోద (32) కడుపునొప్పి తాళలేక ఉరివేసుకొని మృతి చెందింది. ఈ ఘటన సోమవారం జరిగింది. ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో మృతురాలు ఇంటిపై కప్పుకు చీరతో ఉరి వేసుకుంది. ఆమెకు ఒక కొడుకు, కూతురు ఉన్నారు. మృతురాలి తండ్రి తిప్పేస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీరామ్ నాయక్ తెలిపారు.

పంచాయతీ కార్మికుడు..

వెల్దుర్తి టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి పట్టణానికి చెందిన మాల వెంకటస్వామి (38) అనే పంచాయతీ కార్మికుడు సోమవారం రాత్రి తన ఇంట్లో కొకేన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య పిల్లలు గమనించి, బంధువులకు సమాచారం ఇచ్చారు. వెంటనే మృతుడ్ని కిందకు దించే సరికి మృతి చెందాడు. మృతునికి భార్య అఖిల, కొడుకు, ఇద్దరు కూతుళ్ల సంతానం ఉన్నారు.

'పల్లె పండుగ' పనులకు నిధుల కొరత

● పనులు పూర్తయినా ఒక్క రూపాయి విడుదల కాని వైనం

● అప్పుల ఊబిలోకి తెలుగు తమ్ముళ్లు


గోకులం షెడ్డును ఆరంభిస్తున్న ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ (ఫైల్)

ఆలూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో రోడ్లు బాగు చేయాలని ఎంతో ఆర్భాటంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పల్లె పండుగ పేరుతో సీసీ రోడ్ల నిర్మాణంకు శ్రీకారం చుట్టింది. ఇందు కోసం తెలుగు తమ్ములు పోటీ పనులు చేసేందుకు పోటీపడి గ్రామాల్లో రోడ్లు వేశారు.

● ఒక్క రూపాయి నిధులు విడుదల కాలేదు..

అప్పులు చేసి, గ్రామంల్లో టీడీపీ నాయకులు రోడ్లు వేసి ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి నిధులు విడుదల కాకపోవడంతో అధికారుల చుట్టూ బిల్లులు చెల్లించాలంటూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆలూరు మండలంలో 16 గ్రామ పంచాయతీల్లో పల్లె పండుగ నిధుల ద్వారా రూ. 2.47 కోట్లతో రోడ్లు వేశారు. 3 నెలలు గడచిన నిధులు రాకపోవడంతో అప్పుల భారం పడిందని, ముందే తెలిసి ఉంటే పనులు చేసే వాళ్ళం కాదని టీడీపీ నాయకులు అధికారుల ఎదుట వాపోతున్నారు.

● గోకులం షెడ్ల పరిస్థితి కూడా ఇంతే...

ఉపాధి హామీ నిధులతో ఆలూరు మండలంలో 53 గోకులం షెడ్లు మంజూరు అయ్యాయి. ఒక్కో షెడ్ నిర్మాణం కోసం రూ.1.50 లక్షలు మంజూరు చేసింది. ఇప్పటికే 41 పూర్తి అయ్యాయి వాటిని ఆర్భాటంగా ప్రారంభోత్సవం కూడా చేశారు. అయితే వీటికి సంబంధించి ఒక్క రూపాయి నిధులు కూడా మంజూరు కాలేదని ఏపీవో శ్రీనివాసులు తెలిపారు. చేసిన పనులకు బిల్లుల ఇంకా రాలేదని అధికారులు సమాధానం చెబుతుండటంతో తెలుగు తమ్ముళ్లు లబోదిబో మంటున్నారు.


పల్లె పండుగ రోడ్డు పనులు ఆరంభిస్తున్న టీడీపీ నాయకులు, అధికారులు (ఫైల్)

● ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉంది

ఆలూరు మండలంలో పల్లె పండుగ నిధులు ద్వారా గ్రామాల్లో వేసిన రోడ్లకు సంబంధించి రూ.2.47 కోట్లు రావాల్సి ఉంది. పనులు పూర్తయ్యాయి. బిల్లుల కోసం ప్రతి రోజూ వస్తున్నారు. సమాధానం చెప్పలేక పోతున్నాను.

-చౌడరెడ్డి, జేఈ పంచాయతీ రాజ్ శాఖ, ఆలూరు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



మంత్రాలయంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

మంత్రాలయం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాలు పెంచాలని, వారి సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ డివిజన్ నాయకులు రామన్న, నాయకులు జయరాజు, భీమేశ్వరి, డిమాండ్ చేశారు. సోమవారం మంత్రాలయం ఐసీడీఎస్ కార్యాలయం ముందు అంగన్‌వాడీ కార్యకర్తలు సీఐటీయూ నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు పెంచి గ్రాట్యుటీ అందజేసి.. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెస్సిబారాణి, విశాలాక్షి, ప్రమీళ, లావణ్య, నరసమ్మ, తులిసమ్మ, అనిత, స్వప్న, లుధియా, కళ్యాణి, రాధా, ధనులక్ష్మి, భాగ్యమ్మ, శాంతమ్మ, మాదురి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు గోవర్ధనమ్మ, శైలజ, నాగలక్ష్మి, సీఐటీయూ నాయకులు గోవిందు, రాముడులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్ నుంచి సీడీపీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో 42 రోజుల పాటు ధర్నా చేపడితే అంగన్‌వాడీ కార్యకర్తలకు మద్దతు ఇచ్చిన టీడీపీ నాయకులు అధికారంలో వచ్చి తమను పట్టించుకోవడంలేదన్నారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగేశ్వరమ్మ, అరుణ, భాగ్యమ్మ, వరలక్ష్మి, పుష్ప, శారద, లక్ష్మీ పాల్గొన్నారు.

సమగ్ర విచారణ జరపాలి

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న ఇటుకల బట్టీల్లో పనిచేస్తున్న కార్మికుల మృతికి కారణమైన యజమానులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు తిమ్మగురుడు, వీరేష్, నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు పట్టణ అధ్యక్షులు విజయేంద్ర ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దారు శేషఫణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వీరేష్, మల్లికార్జునగౌడు, మాలిక్, ఖాజా, నరసింహులు, రాము, నరసప్ప, గోపాల్, నాగరాజు, హనుమంతు, ఖాదర్, విష్ణులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

మంత్రాలయం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన సునీల్ పద్మనాభం అనే భక్తుడు రూ.1.50 లక్షలు విరాళం ఇచ్చినట్లు ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ తెలిపారు. సోమవారం కుటుంబ సమేతంగా ఆయన రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని నగదును విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల,పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో అనంతపురాణిక్, శ్రీపాధాచార్, గిరిధర్ పాల్గొన్నారు.

శ్రీమఠం భూములను ఇవ్వాలి



శ్రీమఠం మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

మంత్రాలయం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వందపడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి శ్రీరాఘవేంద్రస్వామి మఠం భూములను కేటాయించాలని ఏఐవైఎఫ్ మండలాధ్యక్ష, కార్యదర్శులు చిన్న, రాజు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు ఎస్ రవి, శ్రీమఠం మేనేజరు వెంకటేష్ జోషిలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు కి.మీ దూరంలో ఉన్న కల్లుదేవకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, శ్రీమఠం ఆస్పత్రులు ఉన్నప్పటికి ప్రజలకు, భక్తులకు సరైన వైద్య సేవలు అందడం లేదన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి స్థలం లేకపోవడంతో పెద్ద ఆస్పత్రి నిర్మించేందుకు వైద్యాధికారులు ముందుకు రావడం లేదన్నారు. రాఘవేంద్రస్వామి మఠానికి చెందిన స్థలం కేటాయిస్తే వందపడకల ఆస్పత్రి నిర్మించి 24 గంటలు వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. శ్రీమఠం అధికారులు స్పందించి స్థలం కేటాయించాలని కోరారు.

గంజహళ్లిలో పారిశుధ్య పనులు



ఎక్స్‌కవేటర్‌తో పారిశుధ్య పనులు చేపడుతున్న కార్మికులు

గోనెగండ్ల, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంజహళ్లి గ్రామంలో రెండు రోజులుగా పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపడుతున్నారు. డెంగీ, మలేరియా, తదితర అంటువాధ్యులు ప్రబలకుండా ఉండేందుకు గాను ముందుజాగ్రత్త చర్యలో భాగంగా మురికి కాలువలను శుభ్రం చేయడం, గ్రామంలో ఉన్న చెత్త దిబ్బలను తొలగించడం, బ్లీచింగ్ పౌడర్ వీధుల్లో, మురికి కాలువల్లో చల్లడం దోమలు పెరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చేస్తున్నామని, గ్రామంలో ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉరుకుందలో ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న స్వామి వారు

కౌతాళం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఏకాదశి సందర్భంగా ఆలయంలో స్వామివారి పల్లకోత్సవం చేపట్టి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. కొంత మంది భక్తులు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వంటకాలు చేసి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు.

కనీస సౌకర్యాలు కరువు

• అభివృద్ధికి నోచుకోని శివారు కాలనీలు
• ఇబ్బందుల్లో స్థానికులు

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణం ఎంతో వేగంగా విస్తరిస్తోంది. 34 వార్డులో దాదాపు లక్షా ముప్పైవేల జనాభా నివసిస్తున్నారు. అదేస్థాయిలో పట్టణ శివారులో పలు కాలనీలు వెలిశాయి. ఆ కాలనీలు ఏర్పడి ఏళ్ల గడుస్తున్నప్పటికి కనీస వసతులకు నోచుకోవడం లేదు. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణ శివారులల్లో ముస్లిం మైనార్టీ కాలనీ, రాధాకృష్ణా నగర్, తిరుమలనగర్, ఎల్లమ్మ బీడు, నాయీ బ్రాహ్మణ కాలనీ, మైనార్టీకాలనీ, సంజీవయ్య నగర్, న్యూ ఎస్‌సీ కాలనీ, మిలటరీ కాలనీలు ఉన్నాయి. అయితే నివాస గృహాలకు సరిపడా మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. మైనార్టీ కాలనీలో మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. అలాగే డ్రైనేజీలు సైతం ఎక్కడా ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. అలాగే నాయీ బ్రాహ్మణ కాలనీలో సైతం మౌలిక వసతులు లేవు. దొంగతనాలు అధికంగా జరుగుతున్నాయి. అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారడంతో పలువురు నివాస గృహాలను వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. సీసీరోడ్లు లేవు. తాగునీరు పక్క కాలనీలు అయిన ఎన్‌టీఆర్ నగర్, శివన్న నగరు, టిడ్కో గృహాలకు వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే మిలిటరీ



నాయీబ్రాహ్మణ కాలనీలోని మట్టి రోడ్డు

కాలనీలో ఒకటి రెండు సీసీ రోడ్లు వేశారే తప్పించి పూర్తిస్థాయిలో లేవు. పన్నులు మాత్రం మునిసిపాలిటీ అధికారులు ముక్కుపిండి వసూలు చేస్తున్నప్పటికి ఆ స్థాయిలో కాలనీవాసులకు మౌలిక వసతులు కల్పించడం, కాలనీల అభివృద్ధి కోసం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఎన్నికల సమయంలో మాత్రం శివారు కాలనీలకు పెద్ద పీట వేస్తామని, రోడ్లు, తాగునీరు, డ్రైనేజీలు ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చి ఎన్నికల అనంతరం ప్రజల కష్టాలను పాలకులు కాని అధికారులు కాని పట్టించుకున్న పాపానపోలేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి ప్రత్యేక ప్రణాళికతో శివారు కాలనీలను అభి వృద్ధి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సౌకర్యాలు లేవు



తమకు 40 సంవత్సరాల కింద పట్టాలు ఇచ్చారు. దాదాపు పదేళ్లనుంచి ఇక్కడే నివాసం ఉంటున్నాను. సౌకర్యాలు ఏమి లేవు. తాగునీరు శివన్న నగర్‌కు వెళ్లి తెచ్చుకుంటున్నాం. ఇక్కడ గతంలో చాలా కుటుంబాలు నివాసం ఉండేవి, సౌకర్యాలు లేక, దొంగల బెడద, తాగుబోతుల తాకిడి తట్టుకోలేక వేరే చోటకు వెళ్లిపోయారు. రోడ్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి.

- ఈరన్న, నాయీబ్రాహ్మణ కాలనీ

సీసీ రోడ్లు నిర్మించాలి



ఏడేళ్లనుంచి నివాసం ఉంటున్నాను. టీడీపీ ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది. ఇక్కడ సీసీ రోడ్లు లేక వర్షాలు పడితే నడిచే పరిస్థితి కూడా ఉండదు, మోకాళ్ల లోతు బురద ఉంటుంది. డ్రైనేజీల సౌకర్యం కూడా లేదు. ఎండాకాలం వచ్చిందటే నీటి కష్టాలు మొదలవుతుంది. మౌలిక వసతులు కల్పించాలి.

- అక్బర్‌బాషా, మైనార్టీ కాలనీవాసి

చెక్క రథంపై ప్రహ్లాదరాయలు



చెక్క రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు చెక్కరథంపై విహరించారు. సోమవారం మాఘ పంచమి శుభ దినం సందర్భంగా పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి విశేష పూజలు నిర్వహించారు. చెక్క రథాన్ని పుష్పాలతో చూడముచ్చటగా అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాలు భక్తుల ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవలో నిర్వహించారు. అంతక ముందు స్వామి వారికి పాదపూజ చేసి పల్లకిలో ఊరేగించి హారతులు ఇచ్చారు. మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేశారు.

నైపుణ్య శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోండి

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పొదుపు గ్రూపులో ఉన్న కుటుంబ సభ్యులలో ఎవరైనా డిగ్రీ పూర్తి చేసుకున్న వారు నైపుణ్య శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని మునిసిపల్ కమిషనర్ గంగిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆశ సొసైటీ ద్వారా అప్రెంటిస్ ఉద్యోగ నైపుణ్యంపై, ఇంగ్లీష్ నైపుణ్యంపై వివిధ రకాల నైపుణ్య శిక్షణ తరగతుల నిర్వహిస్తారన్నారు. శిక్షణా తరగతులలో చేరిన రోజు నుంచి అన్‌లైన్ తరగతులు విన్నందుకుగాను ప్రతి నెల రూ4500 స్టైపండు ఇస్తారన్నారు. ఇందులో ఆశ సొసైటీ వారికి రూ. 1000సర్వీస్ చార్జీ ఉంటుందన్నారు. అర్హులైన డిగ్రీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్ నంబర్లను 7901610388,7901610353 సంప్రదించాలని సూచించారు.

వర్మీ కంపోస్టుతో పంచాయతీ ఆదాయాన్ని పెంచాలి

గోనెగండ్ల, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు తప్పని సరిగా గ్రామ పంచాయతీలో వర్మీకంపోస్టును తయారు చే సి పంచాయతీ కి ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నట్లు గంజహళ్లి పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గంజహళ్లి గ్రామంలోని చెత్త సంపద కేంద్రంలో వర్మీ కంపోస్టు తయారు చేసేందుకు గాను చెత్త తొట్లలో వానపాములను వదిలినట్లు తెలిపారు. చెత్త సంపద కేంద్రంలో వర్మీ కంపోస్టు ను తయారు చేసి అమ్మి పంచాయతీకి ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య, వీధి దీపాల సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఏటీఎం .. ఎనీ టైం మూతే



వారం రోజులుగా తెరుచుకోని ఏటీఎం తలుపులు

కౌతాళం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కౌతాళంలోని స్టేట్ బ్యాంకు వద్ద ఉన్న ఏటీఎం వారం రోజులుగా మూత పడటంతో ఖాతాదారులు, మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏటీఎం పని చేస్తుందని చుట్టూ పక్కల గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తలుపులు వేసిన దాని చూసి వెనుదిరుగు తున్నారు. సంబంధిత బ్యాంకు అధికారులు మాత్రం పట్టించుకోకపో వడంతో ఇదేమి బ్యాంకురా బాబు అని విసుగు చెంది ప్రైవేటు ఏటీఎంను ఆశ్రయిస్తున్నారు. ఎస్‌బీఐ అధికారులు ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఏటీఎం పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రత్యేక ప్రణాళిక

• రైతులకు మార్చి చివరి వరకు సాగునీరు
• ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని రైతులకు, ప్రజలకు సాగు, తాగునీరు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఎల్‌సీ, జీడీపీ, జీఆర్‌పీ, ఇరిగేషన్, ఎంపీడీఓ, ఈఓపీఆర్డీలతో సమావేశమై సాగు, తాగు నీటిపై చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎల్ఎల్‌సీ కాలువకు ప్రస్తుతం 520 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉందని, దాన్ని 600 క్యూసెక్కుల నీటి విడుదలకు టీబీపీ బోర్డు అధికారులతో మాట్లాడి నీటి గేజ్ పెంచేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. టీబీ డ్యాం ద్వార 2.1టీఎంసీల నీటిని రాబడుతున్ననట్లు తెలిపారు. ఎల్ఎల్‌సీ కింద మార్చి 30వరకు సాగునీరు అందించేందుకు ప్రణాళికను సిద్ధం చేశామని తెలిపారు. ఎల్ఎల్‌సీ కింద 6500 ఎకరాలతో పాటు మరో 6000 ఎకరాలకు సాగునీరు అందుతాయని రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అలాగే నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు పట్టణంతో పాటు గోనెగండ్ల, నందవరం ఎమ్మిగనూరు మండలాల్లో తాగునీటి సమస్య ఏర్పడకుండా ప్రణాళిక రూపొందించామన్నారు. నియోజకవర్గంలోని 3 మండలాల్లో 80శాతం గ్రామాలకు మే చివరి వరకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వాటర్‌గ్రిడ్ కింద పనులు చేపట్టేందుకుగాను 286కోట్లతో ప్రభుత్వానికి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ప్రతిపాదనలు పంపామన్నారు.

• కొత్త బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే : ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోకు మంజూరైన నాలుగు కొత్తబస్సులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం బెంగళూరు పట్టణానికి రెండు బస్సులు, బళ్ళారికి రెండు బస్సు సర్వీసులను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిఎం మద్దిలేటి నాయుడు, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, టీడీపీ నాయకులు ఈరన్న గౌడ్, నారాయణ రెడ్డి, చిన్న రాముడు, మల్లికార్జున, గురరాజ దేశాయి, చంద్రశేఖరరెడ్డి కడిమెట్ల చెన్నారెడ్డి, శంకర్‌గౌడ్, రామకృష్ణ నాయుడు, ముల్లా కరిముల్లా, నజీర్, రంగస్వామి, తురేగల్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో పనులు

మండిపడుతున్న తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు



ఉపాధ్యాయులకు టీ తెస్తున్న విద్యార్థులు, బిందెలతో నీటిని తెస్తూ..

మంత్రాలయం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువు కోసం వస్తే.. విద్యార్థులతో పనులు చేయిస్తున్నారు. పాఠశాలలో పనుల చేసేందుకు నలుగురు స్వీపర్లు ఉన్నా వారిని కూర్చోబెట్టి విద్యార్థులతో పనులు చేయించడం విమర్శలకు తావిస్తోంది. అయ్యవార్లకు టీ తీసుకురావాలన్నా.. మైదానంలో చెత్తాచెదారాన్ని శుభ్రం చేయాలన్న, మైదానం చుట్టూ పెంచుతున్న మొక్కలకు నీళ్ల పట్టాలన్న విద్యార్థులే దిక్కు. తమ పిల్లలు చదువుకోవాలని పంపిస్తే.. ఇక్కడ చాకిరి పనులు చేయిస్తున్నారని తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

ఎప్పుడో ఒకసారి చేస్తారు

పాఠశాలలో 1100 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. స్వీపర్లతో పనులు చేయిస్తాం. ఎప్పుడో ఒకసారి విద్యార్థులు మైదానాన్ని శుభ్రం చేస్తారు. మొక్కలకు నీళ్ల పట్టుతారు. విద్యార్థులతో మరలా ఎప్పుడూ పని చేయించం.

- హంపయ్య, జడ్పీ ఉన్నత పాఠశాల, మంత్రాలయం

ఇద్దరే.. ఇద్దరు..

భవిత కేంద్రంలో విద్యార్థులు నిల్

మంత్రాలయం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో సమగ్రశిక్ష భవిత కేంద్రం ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ఏర్పాటు చేసిన పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు బోధిస్తూ.. ఒక ఆయా పని చేస్తున్నారు. ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య కంటే పని చేసే వారే ఎక్కువగా ఉన్నారు. మంత్రాలయం పాత ఉన్నత పాఠశాలలో భవిత కేంద్రం నిర్వహిస్తున్నారు. ఇందుకు కళ్యాణి, శివప్రసాద్ అనే ఐఆర్‌టీ ఉపాధ్యాయులతో పాటు ఆయా భీమక్క పని చేస్తున్నారు. అయితే.. విద్యార్థులు రాకపోయినప్పటికీ ఉన్న ఒకరో ఇద్దరికో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు మ్యాపింగ్, జత పరచడం, కలర్ వేయించడం చేయిస్తున్నారు. విద్యార్థుల హాజరులో 20 మంది ఉన్నప్పటికీ హాజరయ్యేది ఒకరిద్దరు మాత్రమే. ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ కింద ప్రతి విద్యార్థికి రూ.300ల ప్రకారం పది నెలలకు రూ.3వేలు, ఎస్కార్ట్ అలవెన్సు కింద రూ.300 ప్రకారం నెలకు రూ.3వేలు, ఇంటి వద్ద విద్యా అలవెన్స్ కింద రూ.200 ప్రకారం 10 నెలలకు రూ.2వేలు, స్టైపండ్ కింద బాలికలకు మాత్రమే రూ.2వేలు, రీడర్ అలవెన్స్ కింద దృష్టిలోపం ఉన్నవిద్యార్థులకు రూ.3వేలు తల్లిదండ్రుల అకౌంటులకు జమ చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష కింద ఇంతగా నిధులు ఖర్చు పెడుతున్నా ఇక్కడ విద్యార్థులే కరువయ్యారు. ఈ విషయంపై ఎంఈవోలు మైనుద్దీన్, రాగన్నలను వివరణ కోరగా.. ప్రత్యేక అవసరాలు గల పిల్లలపై అవగాహన కల్పించాలని తాను ఈసెంటర్‌ను తనిఖీ చేస్తామన్నారు. విద్యార్థులకు తీసుకురావాల్సిన బాధ్యత ఆయాపై ఉందన్నారు.



భవిత కేంద్రంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

శ్రీశైలానికి తరలిన శివస్వాములు



ఇరుముడి ధరించి శ్రీశైలానికి బయలు దేరుతున్న శివస్వాములు

గోనెగండ్ల, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలో శైవ దేవాలయాలు శివనామస్మరణతో మారుమోగుతున్నాయి. సోమవారం శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శివస్వాములు ఇరుముడి కట్టుకొని శ్రీశైలంకు పాదయాత్రకు బయలుదేరారు. ఆలయాలను ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబుచేశారు. ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

మంత్రాలయం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అగ్రి స్టాక్ ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్ వెబ్‌సైట్‌లో 11 అంకెలతో కూడిన నెంబరును ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జీర గణేష్ అన్నారు. సోమవారం మంత్రాలయంలో 11 అంకెలతో కూడిన ప్రత్యేక గుర్తింపు కార్డును ఆన్‌లైన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 16మంది వీపీఏలు, ఎంపీహెచ్‌ఈవోలు, వీహెచ్‌వోలు పని చేస్తున్నారని, రైతు సేవా కేంద్రంలో ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌తో లింక్ అయిన సెల్‌పోన్‌తో వీపీఏలను సంప్రదిస్తే ఉచితంగా నమోదు చేస్తారని తెలిపారు. భూములున్న ప్రతి ఒక్క రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మార్చి మొదటి వారం ఆఖరుతేదీ గా ఉందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మిరప రైతులను ఆదుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్/పెద్దకడుబూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు మండలాల్లోని మిరప రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు గోవిందు, రాముడు, తిక్కన్న, వరమేష్‌లు డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు తహసీల్దార్ కార్యాలయాల ముందు సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది మిరప రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అలాగే పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక రైతులు దిక్కుతోచని పరిస్థితిల్లో ఉన్నారన్నారు. మిరప రైతులకు క్వింటానికి రూ.25వేల మద్దతు ధర కల్పించాలన్నారు. రైతులకు



మంత్రాలయంలో..

ప్రభుత్వం పంటనష్ట పరిహారంతో పాటు బ్యాంకుల్లో రుణమాఫీ చేసి, ఎకరాకు రూ.2లక్షల రుణాలను అందజేయాలన్నారు. ఖరీఫ్ చివరి వరకు ఎల్లెల్సీ కాలువ ద్వారా సాగునీటిని సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మీనరసయ్య, అబ్దుల్, నాగేష్, రామన్న, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

నందవరం: మండలంలోని మిరప రైతులను ఆదుకోవాలని రైతు సంఘం అధ్యక్షుడు దేవవ్రత డిమాండ్ చేశారు. సోమవారం నందవరం తహసీల్దారు కార్యాలయం ముందు రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు శ్రీనివాసులకు అందజేశారు. కార్యక్రమంలో స్వామిదాసు, జయరాజు పాల్గొన్నారు.

మంత్రాలయం: కర్నూలు జిల్లాలోని మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోని నియోజకవర్గాల్లో సాగు చేసిన మిరప రైతులను ఆదుకోకపోతే మిరప రైతులకు మద్దతుగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని రైతు సంఘం జిల్లా నాయకులు జయరాజు, అంజి, భాస్కర్ యాదవ్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు మిరప రైతులకు గిట్టుబాటు ధర కల్పించి మిరప రైతుల బ్యాంకు రుణాలు రద్దు చేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ రవికి వినతి పత్రం అందజేశారు. రైతు సంఘం నాయకులు ప్రాణేష్, వీరనాగన్న, జాను, శాంతి రాజు, నరసన్న, మోహన్ గీతమ్మ పాల్గొన్నారు.



నందవరంలో తహసీలార్ధ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



పెద్దకడుబూరులో..